



కూరగాయలు
- మండిపోతున్న ధరలు
- చిక్కుడుకాయ కిలో రూ.120 7
- మిగతావి కిలో రూ.60పైనే

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



నామినేషన్లకు వేళాయె

- నల్లగొండ, చండూరు డివిజన్‌లో తొలివిడత
- 318 సర్పంచ్, 2,870 వార్డులకు నేటి నుంచి నామినేషన్లు
- స్వీకరణకు 117 క్లస్టర్లు ఏర్పాటుచేసిన అధికారులు
- సత్తాచాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ తహతహ
- బలమైన అభ్యర్థులతో రంగంలోకి దిగేందుకు బీఆర్ఎస్ సిద్ధం
- గ్రామాలకు కేంద్రమే అండగా ఉందనే నినాదంతో బీజేపీ
- బరిలో నిలిచేందుకు సిద్ధమైన వామపక్షాలు

నల్లగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. పంచాయతీ ఎన్నికలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఇదిలా ఉండగా, 20నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలకు కార్యాచరణ మొదలవడంతో రాజకీయవర్గాల్లో సందడి మొదలైంది. సాంకేతికంగా ఈ ఎన్నికలు రాజకీయపార్టీల గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయి. కానీ, రాజకీయపార్టీలు మాత్రం పార్టీల నుంచి అభ్యర్థులను నిలబెట్టి మద్దతు ప్రకటిస్తూ వస్తున్న సంప్రదాయం కొనసాగుతోంది. జిల్లాలో అన్ని రాజకీయపార్టీలూ ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నాయి. పంచాయతీల్లో పార్టీ నేతలే సర్పంచ్‌లుగా ఉంటే కలిసొస్తుందని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తమ ఖాతాలో పడతాయని అధికార కాంగ్రెస్ నేతలు భావిస్తుంటే, తమ అభ్యర్థులు గెలిస్తే పార్టీకి క్షేత్రస్థాయిలో క్యాడర్, ఓటు బ్యాంక్ సురక్షితంగా ఉంటుందని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ నేతలు భావిస్తున్నారు.

నేటి నుంచి నామినేషన్లు

నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 14 మండలాల పరిధిలో ఉన్న 318 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లను గురువారం ఉదయం నుంచి స్వీకరిస్తారు. 318 సర్పంచ్ స్థానాలు, 2870 వార్డుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించే నిమిత్తం 117 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే నిమిత్తం మూడు, రెండు పంచాయతీలకు ఒక క్లస్టర్‌ని ఏర్పాటు చేశారు. పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు నింపడం, పొరపాట్లు లేకుండా ఉండేందుకు వీలుగా ప్రతి క్లస్టర్ వద్ద హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించే నిమిత్తం నియమ, నిబంధనలు, ప్రవర్తనానియమావళి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు పాటించాల్సిన విధానాలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలకు గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్లు స్వీకరించే క్లస్టర్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్‌బందోబస్తుని ఏర్పాటు చేయనున్నారు.

హవా చాటేందుకు కాంగ్రెస్ యత్నాలు

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపొందగా, అదే ఊపులో తాజాగా సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ విజయం సాధించాలని తహతహలాడుతోంది. ప్రభుత్వంలో తామే ఉన్నామని, మంత్రిగా తానున్నానని, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా తామే అధికారంలో ఉండడంతో పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులుగా కాంగ్రెస్ నాయకులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి, సంక్షేమపథకాల అమలుకు కృషి చేస్తారని, ప్రతిపక్ష నాయకులను గెలిపిస్తే వారికి ఎవరూ మాట వినరని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పేర్కొన్నారు. దంతో కాంగ్రెస్ నాయకులనే గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇప్పటికే ఆయా పంచాయతీల రిజర్వేషన్ల ప్రకారం ఎవరెవరిని అభ్యర్థులుగా నిలబెట్టాలనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. పార్టీ మండల నాయకులు, గ్రామాల నాయకులంతా కలిసి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపికచేసుకోవాలని ఎమ్మెల్యేలు సూచిస్తున్నారు. పోటీబలంగా ఉన్నచోట్ల జోక్యం చేసుకొని నాయకుల మధ్య వారు సర్దుబాటు చేస్తున్నారు. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉండి కొట్లాడిన ద్వితీయ శ్రేణి నాయకులు పలువురికి, ఎమ్మెల్యేల గెలుపులో క్రియాశీలక పాత్ర వహించిన వారికి సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి ఎమ్మెల్యేలు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. దీంతో మిగతా 8వ పేజీలో...

ఏకగ్రీవాలు ఉండేనా?

- గత ప్రభుత్వ హయాంలో అందని నజరానా
- ఈ సారీ ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేనా?



మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించగా, ఈ నెల 27 నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. దీంతో పల్లెల్లో సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులను ఖరారు చేసేందుకు రాజకీయ పార్టీలు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకుంటాయనే చర్చ ప్రారంభమైంది.

ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు

సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామపంచాయతీలకు ప్రోత్సాహకంగా రూ.10లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి స్పందన ఏ మేరకు ఉంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎలాంటి ఘర్షణలు, వివాదాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పాలకవర్గాలను ఎన్నుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నజరానాను ప్రకటించింది. ఎన్నికల్లో పోటీపడి డబ్బు ఖర్చు పెట్టి గెలిచినా, ఓడినా ఆర్థికంగా నష్టపోవడం తప్ప సాధించేది ఏమీ ఉండదని, ఏకగ్రీవం చేసుకుంటే అభ్యర్థులకు ఖర్చు తప్పడంతోపాటు గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కొంత డబ్బు ఇస్తారని, దానికి తోడు ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షలతో అభివృద్ధి చేసుకోవచ్చని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఒక పార్టీ బలంగా ఉండి, మిగతా పార్టీలు బలహీనంగా ఉన్న చోట ఈ ప్రయత్నాలు అధికంగా జరుగుతున్నాయి. గతంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు ఇస్తామని ప్రకటించింది. అందుకుతోడు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.10లక్షలు ఇస్తామని కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ప్రకటించారు. నాడు ఏకగ్రీవంగా ఎనుకున్న పంచాయతీలకు అటు ప్రభుత్వంగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ నిధులు ఇవ్వలేదు. దీంతో ఈ మిగతా 6వ పేజీలో...

● గత ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వలేదు



గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.10లక్షలు ప్రోత్సాహక నిధులు ఇస్తామని చెప్పింది. ఆ నిధులతో గ్రామాన్ని కొంత అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలు ఐక్యంగా ఉండి సర్పంచ్‌గా నన్ను, ఇతర వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నా పదవీ కాలం ముగిసే వరకు ఎన్నిసార్లు అడిగినా గత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఇస్తానన్న నిధులు ఇవ్వలేదు. దీంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేకపోయాం. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తుందని నమ్ముతున్న.

హైమావతి, మాజీ సర్పంచ్, కోట్యానాయక్ తండా, తిరుమలగిరి

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాణి కుముదిని, పాల్గొన్న కలెక్టర్

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత నామినేషన్లకు తీసుకున్న చర్యలు, బందోబస్తు, రిసెప్షన్ కేంద్రాల వివరాలను అప్‌లోడ్ చేయటం, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, వివిధ రకాల కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో గ్రామ పంచాయతీ ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు, పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఈ నెల 27 నుంచి స్వీకరించనున్న మొదటి విడత నామినేషన్ల సందర్భంగా ఆర్వోలతో తక్షణమే టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణఅమిత్, అదనపు ఎస్పీ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. బుధవారం ఉదయాదిత్య భవన్‌లో ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి విడత 14 మండలాల్లోని 117 క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరిస్తామని, గ్రామపంచాయతీ ఎన్నికలను అధికారులందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమయపాలన పాటించాలని, నామినేషన్ల కేంద్రం వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని నామినేషన్ ఫాంలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, నల్లగొండ, చండూరు ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే హక్కులకు రక్షణ

● ఇన్‌చార్జి డీఆర్వో అశోక్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంతోనే అందరి హక్కులకు రక్షణ ఉంటుందని ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని హక్కులు, బాధ్యతలు ప్రతీ పౌరుడు తెలుసుకొని ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్‌నాయక్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ.60వేలకోట్లతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 60వేల కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో పట్టణంలోని నాగార్జునసాగర్ ఎక్స్‌రోడ్ నుంచి దర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయం వరకు మహబూబ్‌నగర్-నల్లగొండ రహదారికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. వారం రోజుల్లో సాగర్ ఎక్స్‌రోడ్ నుంచి దర్వేశిపురం వరకు నిర్మించే నాలుగు లేన్ల రహదారి పనులను ప్రారంభిస్తామన్నారు. దర్వేశిపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే రూ.12కోట్లతో సీసీ రోడ్డుతోపాటు, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ మీడియన్ కట్టించామన్నారు. అలాగే కొత్తపల్లి-ముషంపల్లి రహదారులతోపాటు, జిల్లాలో అన్ని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లతోపాటు, మురుగు కాల్వలను నిర్మిస్తున్నామని, ఏఎంఆర్పీ కాల్వల లైనింగ్‌కు రూ.450 కోట్లు మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలే బస్సులను నిర్వహించుకునేలా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, రైతు భరోసా, సన్న బియ్యం, సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఇల్లు లేని పేదవారు ఉండకుండా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో రేషన్ షాపు ఉండేలా చూశామని, నియోజకవర్గంలో 18 కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే మూడేళ్లలో గ్రామాల స్వరూపాలను మారుస్తామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, నియోజకవర్గంలో కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాల్లో మహిళలతో రైస్ మిల్లుల నిర్వహణకు రైస్‌మిల్లు కట్టించి ఇస్తామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను డిసెంబరులో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

● మనోధైర్యం కల్పిస్తే సగం రోగం నయమైనట్లే ● డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



గుండ్రాంపల్లిలో మందుల నిల్వలను, రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రంలోని మందుల నిల్వలు, రికార్డులు, రోగులకు సంబంధించిన వివరాలను, పరీక్షల వివరాలను రికార్డులను పరిశీలించారు. రోగులకు అందించే మందులు సకాలంలో అందుతున్నాయా? అని, ప్రజలకు అందిస్తున్న సేవలను వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, సిబ్బందిని అడిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ప్రజలు ఆసుపత్రులకు వస్తారని, వారికి ముందుగా సాంత్వన కలిగించే విధంగా వైద్యులు, వైద్యసిబ్బంది వ్యవహరిస్తే వారి అనారోగ్య సమస్యలను పూర్తిగా నివారించగలుగుతారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అనారోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ పరీక్షలు చేయాలన్నారు. వారివెంట ఏఎన్‌ఎంలు హేమలత, మల్లీశ్వరి, ఆశాలు శంకరమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

నల్లగొండ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్లు గురువారం నుంచి ప్రారంభమవుతున్న దృష్ట్యా సంబంధిత నోడల్ అధికారి అవసరమైన సామగ్రితో సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుంచి ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

● నామినేషన్ కిట్ అందజేత



పంచాయతీ ఎన్నికలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం నల్లగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏఆర్వో, అసిస్టెంట్ ఏఆర్వోలకు నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన సామగ్రిని అందజేశారు.

పదవులు కాదు పార్టీయే ముఖ్యం

- దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి 7
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



భువనగిరిలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం ఆగదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించడాన్ని నిరసిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేయడం తగదన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే బీసీలకు 17శాతం సీట్లు కూడా దక్కడం లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా బీసీ బిడ్డ ఎన్నిక కావడాన్ని రెడ్డీ సామాజిక వర్గం జీర్ణించుకోలేకపోతోందన్నారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జక్కా నాగేశ్వరరావు, కొరత సురేష్, రాము, గోపి, సైదయ్య, వెంకటేశ్వర్లు, జానకిరాములు, శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన పార్టీగా నిలిచిపోతుంది

మిర్యాలగూడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్, బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సరికాదన్నారు. బీసీలను మభ్యపెట్టి, మోసగిస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు కవిత, రాజశేఖర్, వెంకటేష్, లక్ష్మణ్, ఫరూఖ్, నాగర్జున, వంశీ, భీమరాజు, శరత్, శ్రీను పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాత్ర ఏదైనా స్టేజీపైకి వస్తే నవ్వాల్సిందే

● పిట్టల దొర నటనతో గుర్తింపు, డ్యాన్స్, పాటలు ఏకపాత్రాభినయం ● పలు సినిమాల్లో నటించిన వెంకటేశంగౌడ్

విద్యార్థులకు బోధన చేస్తూనే తనకు ఇష్టమైన కళలపై ఆసక్తి పెంచుకొని ప్రజల మన్ననలు పొందుతున్నాడు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెలువర్తి గ్రామానికి చెందిన మల్లం వెంకటేశంగౌడ్. 25 సంవత్సరాల క్రితం ఆ గ్రామంలో ఒక ప్రైవేట్ పాఠశాలను స్థాపించారు. చిన్నప్పటి నుంచే డ్యాన్స్, పాటలు ఏకపాత్రాభినయం, పిట్టల దొర నటన షార్ట్ ఫిల్మ్‌లో రాణిస్తున్నాడు.

● ఆంధ్రజ్యోతి, వలిగొండ

వెంకటేశం మూడో తరగతి చదువుకునే రోజుల్లో ఆ గ్రామంలో గౌడపురాణం అనే వీధినాటకం ప్రదర్శించారు. నటనపై ఆయనకు ఉన్న ఆసక్తిని గుర్తించిన నిర్వాహకులు సుందరి పాత్ర పోషించాలని సూచించారు. ఎలాంటి భయం, జంకూ లేకుండా స్టేజీపైకి ఎక్కి అలవోకగా సుందరీ పాత్రను రక్తికట్టించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఆ వీధి నాటకమే అతనిని కళలవైపు నడిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో నవ్వులకు పెట్టింది పేరు పిట్టల దొర ఏకపాత్రాభినయం తనకున్న తెలుగు సాహిత్యం పట్టుతో మాటల గారడీతో పిట్టల దొర వేషాదారణ స్వచ్ఛమైన పల్లె భాషలో వేశాడు. చేతిలో తుపాకీ పట్టుకొని తలపై టోపీ పెట్టుకొని చినిగిన చొక్క వేసుకొని స్టేజీపైకి వచ్చి పాటలు పాడుతూ మాటలతో పిట్టల దొర పాత్ర పోషించారు. ఆ పాత్రతో సాహిత్య అభిమానుల చూరగొన్నాడు. తను వేసిన ఆ పాత్రతో కమెడీయన్‌గా గుర్తింపు పొందారు. పాత్ర ఏదైనా వెంకటేశం స్టేజీపైకి వచ్చాడంటే ప్రేక్షకులు నవ్వుకోవాల్సిందే.

జై బోలో తెలంగాణ సినిమాలో..

జై బోలో తెలంగాణ సినిమాలో గారడీ చేస్తుండు.. గడబిడ చేస్తుండు.. అనే పాటతో పిట్టల దొర పాత్రలో డ్యాన్స్ చేశారు. ఆయన నటన చూసి ప్రజాయుద్ధనౌక గద్దర్ ముచ్చటపడ్డారు. సాహిత్యం, కళను వీడవద్దని వెంకటేశానికి సూచించారు.



స్కైలాబ్ సినిమా షూటింగ్‌లో సన్నివేశం



నటించిన సినిమాలు

వెంకటేశం పలు సినిమాల్లో నటించారు. స్కైలాబ్, మట్టికథ, చెడ్డీగ్యాంగ్, రేవంత్‌రెడ్డి బయోపిక్ (సినిమా షూటింగ్ కొనసాగుతుంది) నటించారు. స్వతహాగా నందక్షర అనే పేరుతో యూట్యూబ్ ఛానల్ కూడా నిర్వహిస్తున్నాడు. సుమారు 60కిపైగా షార్ట్‌ఫిల్మ్‌లో నటించాడు. వెర్రిపుష్పం మంచి గుర్తింపు తెచ్చింది. అందులో కామెడీ నటనతో పలువురి ప్రశంసలు పొందారు.

దక్కిన అవార్డులు

నటనలో రాణిస్తున్న వెంకటేశంకు పలు అవార్డులు దక్కాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి నుంచి అవార్డు అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు అప్పటి వైస్ చాన్సలర్ రామకృష్ణ నుంచి ప్రథమ బహుమతి పొందారు. ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విష్ణుదేవ్ నుంచి అబ్దుల్‌కలాం అవార్డును కూడా పొందారు.

మిమిక్రీ ఆర్టిస్టు నుంచి నటుడిగా

● యాంకర్, క్యారెక్టర్ ఆర్టిస్టుగా గుర్తింపు ● తల్లి ప్రోత్సాహంతో కళారంగం వైపు ● నటనలో రాణిస్తున్న గంధం రాము

కళలంటే చిన్నప్పటి నుంచి అభిరుచి. స్కూల్లో చదువుకునే రోజుల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు పాల్గొని ప్రతిభ కనబరిచేవారు. అతనిలో నటనను గుర్తించిన తల్లి నాటకాల్లో మంచి పాత్రలు వేయాలని ప్రోత్సహించింది. నటనలో రాణించి పలువురి మన్ననలు పొందుతున్నారు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామానికి చెందిన కళాకారుడు గంధం రాము.

● ఆంధ్రజ్యోతి, చివ్వెంల

చందుపట్ల గ్రామానికి చెందిన గంధం రాములు- కర్షమ్మ దంపతులకు రెండో సంతానం రాము. ఒకటి నుంచి 10వ తరగతి వరకు చందుపట్లలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివాడు. సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి హోటల్, ఇతర పనులు చేసి జీవనం సాగించారు. తర్వాత రామోజీ ఫిలింసిటీలో ఉద్యోగిగా చేరారు. నటీనటులను చూసి తాను కూడా వారిలా నటించాలని ఆశపడి ఈ టీవీలో ప్రసారమయ్యే జబర్దస్త్ కార్యక్రమంలో చమ్మక్‌చంద్ర టీంలో అవకాశం దక్కింది. సుమారు 100 ఎపిసోడ్‌లలో నటించారు. జబర్దస్త్ కార్యక్రమంలో 'బతుకు జట్కా బండి' అనే స్కిట్‌లో అద్భుతంగా రాణించారు. కొద్ది రోజుల్లోనే సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశాలు రావడం మొదలయ్యాయి. ఇప్పటివరకు 95సినిమాల్లో నటించారు.

కెరీర్ మలుపు తిప్పిన కేఏపాల్ పాత్ర

'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అనే సినిమా దర్శకుడు రాం గోపాల్‌వర్మ బృందం కేఏ పాల్ పాత్రలో నటించాలని సంప్రదించింది. కేఏపాల్‌ను అనుకరిస్తూ అతనిలా చేయడంతో అందరూ మెచ్చుకున్నారు. రాము మిమిక్రీ ఆర్టిస్టును కావడంతో అతని వాయిస్ అచ్చుగుద్దినట్లు వచ్చింది. రామోజీ



కేఏ పాల్ పాత్రలో గంధం రాము

ఫిలింసిటీలో ఉద్యోగంలో చేరాక అప్పుడప్పుడు మిమిక్రీ చేసేవాడు. ఇతరుల వాయిస్‌లను అనుకరిస్తూ ప్రయత్నం చేయాలని స్నేహితులు ప్రోత్సహించేవారు. ఫిలింసిటీలో కొంతమంది సినీ ఆర్టిస్టుల పరిచయంతో చిన్న చిన్న కార్యక్రమాల్లో మిమిక్రీ చేశారు. తర్వాత సినిమాలు, ఫంక్షన్లు, పెళ్లిళ్ల ఇతర కార్యక్రమాల్లో అవకాశాలు ప్రారంభమయ్యాయి.

సొంత గ్రామంలో ప్రతి సంక్రాంతికి వినోద కార్యక్రమాలు

స్వగ్రామం చందుపట్లలో ప్రతి సంవత్సరం యువజన సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తుంటారు. ఎన్ని పనులు ఉన్నా సంక్రాంతికి వారం రోజుల పాటు అక్కడే ఉండి బహుమతుల కార్యక్ర మంలో ప్రత్యేక ప్రదర్శనలు, గ్రామంలో కొంతమంది వాయిస్ మిమిక్రీ చేసి ఆటపట్టిస్తానని చెప్పారు రాము. రాజకీయ, సినీ ప్రముఖుల వాయిస్ మిమిక్రీ చేసి అలరిస్తానని చెప్పుకొచ్చారు. వీలున్నప్పుడు గ్రామానికి వెళ్లి సేవా కార్యక్రమాలు చేస్తానని వెల్లడించారు. మా అమ్మ ప్రోత్సాహంతో కళా రంగం వైపు వెళ్లినట్లు చెబుతారు రాము.

కార్మికులను వేధిస్తున్నారని పనుల నిలిపివేత



అధికారితో చర్చలు జరుపుతున్న ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్

హుజూర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాం ఇన్‌చార్జి అధికారి కార్మికులను వేధిస్తున్నారని ఆరోపిస్తూ హమాలీ కార్మికులు బుధవారం ఎగుమతులు, దిగుమతులు నిలిపివేశారు. అధికారి వైఖరికి నిరసనగా ఆందోళన చేశారు. 20 రోజులుగా హుజూర్‌నగర్ ఎఫ్‌సీఐ గోదాంలో దిగుమతులు చేయాల్సిన సంచుల కట్టలు, బెల్లు గోదాంలో దిగుమతులు చేయకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సంచులను సరాసరి ఐకేపీ సెంటర్లకు తరలిస్తున్నారని ఆరోపించారు. తమకు పనులు లేకుండా చేస్తున్నారని ఆవేదన చెందారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ఐకేపీ సెంటర్లు, సహకార సంఘాలకు తరలించే గోనె సంచులను పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాంలో దిగుమతి చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా సరాసరి ఆయా సెంటర్లకు తరలిస్తూ తమకు కూలి డబ్బులు రాకుండా గోదాం ఇన్‌చార్జి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ గోదాం ఇన్‌చార్జితో చర్చలు జరిపారు. కూలీలకు రావాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని, వారికి పనికల్పించాలని కోరారు. సంబంధిత అధికారి హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి ఎగుమతులు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకన్న, రామ్మూర్తి, శివ, రాములు, వెంకయ్య, శ్రీనివాసు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి



పెద్దఅడిశర్లపల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఘనపురం స్టేజీ వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని మహిళ మృతిచెందింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని మతిస్థిమితం లేని మహిళ జాతీయ రహదారిలోని ఘనపురం స్టేజీ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మతిస్థిమితం లేని మహిళ తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. ఘనపురం గ్రామ కార్యదర్శి గోన వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌ఐపై డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భూకబ్జాదారులకు ఎస్‌ఐ వత్తాసు పలుకుతున్నారంటూ అతనిపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ పట్టణానికి చెందిన కర్నాటి యాదగిరి నల్లగొండ రూరల్ ఎస్‌ఐపై డీజీపీ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ రోడ్డులోని మర్రిగూడ వద్ద ఉన్న ప్లాటు కలిగి ఉన్నట్లు తెలిపారు. ప్లాటుకు సంబంధించి అన్ని లీగల్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంటు కలిగి ఉండి నిర్మాణం కోసం మున్సిపల్ పర్మిషన్ కూడా పొందినట్లు తెలిపారు. అయితే నిర్మాణంలో ఉన్న ప్లాట్‌లోనికి కొందరు భూకబ్జాదారులు దౌర్జన్యంగా గోడ కూల్చివేసి, ఇనుప కంటైనర్ డబ్బా వేసిన వ్యక్తులకు రూరల్ ఎస్‌ఐ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

బాల్య వివాహం అడ్డగింత

నాగార్జునసాగర్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో బుధవారం పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సాగర్ హిల్‌కాలనీకి చెందిన యువకుడితో పీఏపల్లి మండలానికి చెందిన మైనర్ బాలికతో వివాహం జరుగుతుందని జిల్లా అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్ అధికారులు అక్కడికి చేరుకుని వివాహాన్ని నిలిపివేశారు.

అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్

మిర్యాలగూడ అర్బన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పేకాట, మద్యానికి బానిసైన ఓ యువకుడు చేసిన అప్పులు తీర్చేందుకు దొంగ అవతారమెత్తాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఇటీవల జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో యువకుడితోపాటు అతడికి సహకరించిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని దీక్షిత్‌నగర్‌కు చెందిన మందడి వినోద్ కొంతకాలంగా పేకాటకు అలవాటయ్యాడు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పేకాట ఆడుతూ స్నేహితులు, పరిచయస్థుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు చెల్లించకపోవడంతో అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దొంగతనం చేసి తీసుకున్న అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్నాడు. వీధుల్లో ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధుల మెడలోని బంగారుపుస్తెల తాడు కాజేయాలని పథకం పన్నాడు. అందులో భాగంగా ఈ నెల 14న తన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వచ్చిన నిందితుడు వినోద్ పలుకాలనీల్లో తిరిగాడు. బంగారుగడ్డకాలనీలో వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న సిరంశెట్టి లక్ష్మి అనే వృద్ధురాలి మెడలో ఉన్న 3.2తులాల బంగారు పుస్తెలతాడు అపహరించి హుజూర్‌నగర్‌కు పారిపోయాడు. ఈ విషయాన్ని తన స్నేహితురాలు నజ్మాతో చెప్పి ఏదైనా బ్యాంకులో తాకట్టుపెట్టి నగదు తెచ్చి ఇవ్వాలని కోరారు. అందుకు అమె అగీకరించి శ్రీరామ్ ఫైనాన్స్‌లో పుస్తెలతాడు తాకట్టుపెట్టి రూ. 2,30,000 గోల్డ్‌లోన్ తెచ్చింది. అలా వచ్చిన డబ్బులో రూ.80వేల అప్పులు తీర్చి, మిగతా రూ.2.30లక్షలతో మళ్లీ పేకాట ఆడి పోగొట్టుకున్నాడు. అప్పులు తీరకపోవడం, జల్సాలకు డబ్బులు లేకపోవడంతో మళ్లీ దొంగతనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

చేసేందుకు ఈ నెల 25న వినోద్ మిర్యాలగూడలోని రాజీవ్‌చౌక్ వద్దకు వచ్చాడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పోలీసులు గమనించి ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో తాను చేసిన నేరాన్ని అంగీకరించడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడికి సహకరించిన నజ్మాను అరెస్టుచేసి 3.2తులాల బంగారు గొలుసు, పల్సర్‌బైక్, సెల్‌ఫోన్, టోపీ, మాస్క్, చేతి గడియారం స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన టూటౌన్‌సీఐ సోమనర్సయ్య, ఎస్‌ఐ రాం బాబు, ఏఎస్‌ఐ చంద్రయ్య, హెడ్‌కానిస్టేబుల్ స్వర్ణనాయక్, పీసీలు అక్బర్ పాషా, లక్ష్మయ్య, రామకృష్ణ, కళ్యాణ్, మణిదీప్, రాజశేఖర్‌ను డీఎస్పీ అభినందించారు.

అక్కలాయిగూడెం పాఠశాలలో విచారణ లేనట్లేనా?

● చెట్ల నరికివేతపై విచారణకు నియమించిన అధికారి ఎన్నికల విధుల్లోకి ● అధికారిని మారుస్తారా.. అటకెక్కిస్తారా?



చెట్ల కింద నీడలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్‌ఫొటో)



అక్కలాయిగూడెం పాఠశాల

నల్లగొండ/నల్లగొండ క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అక్కలాయిగూడెం జడ్పీహెచ్‌ఎస్‌లో అనుమతి లేకుండా చెట్లు నరికిన ఘటనపై విద్యాశాఖ విచారణ ఆటకెక్కే విధంగా మారింది. 35 నుంచి 40 సంవత్సరాల క్రితం పాఠశాలలో నాటిన వేప చెట్లను నరికి, విక్రయించిన విషయంలో ఉపాధ్యాయుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు విచారణ చేసి చెట్ల సైజులు కొలతలు తీసుకోవడంతో పాటు ఎన్ని చెట్లు నరికారనే దానిపై ఐదవ వంతుల జరిమానా ప్రకారం కొనుగోలు చేసిన వారిపై రూ.30,300ల జరిమానా విధించారు. విక్రయించిన విషయంలో ఎంతమంది ఉపాధ్యాయుల పాత్ర ఉందనే విషయమై విచారణ చేసి చర్యలు తీసుకునేందుకు వి చారణ అధికారిగా నార్కట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములును జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి నియమించారు. ఆయనకు గ్రామపంచాయతీ ఎన్నికల బాధ్యత ఉండటం, గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ఉండడంతో అక్కలాయిగూడెం పాఠశాలకు విచారణకు వెళ్లడానికి ఆటంకంగా మారిందని సమాచారం. తన స్థానంలో వేరొకరిని విచారణ అధికారిగా నియమించాలని, లేనిపక్షంలో వారం రోజుల త్వారత తాను పాఠశాలకు వెళ్లి విచారణ చేస్తానని డీఈవోకు చెప్పాలని హెచ్‌ఎం రాములు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' హెచ్‌ఎం రాములును సంప్రదించగా తాను వారం రోజుల వరకు ఎన్నికల విధుల్లో ఉంటానని, విచారణకు వెళ్లలేనని, ఇదే విషయాన్ని డీఈవోకు తెలియజేస్తానని తెలిపారు.

నరికిన చెట్ల సంఖ్యపై అనుమానాలు

పాఠశాలలో నరికిన చెట్ల సంఖ్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెట్ల నరికివేత కానరాకుండా వేర్లను తొలగించి గుంతలను మొరంతో పూడ్చివేసి ఆనవాళ్లు లేకుండా చేశారు. వాస్తవానికి ఆయా పాఠశాలల్లో ఆవరణలో నూతన నిర్మాణాలు చేపట్టినప్పుడు మాత్రమే అనుమతులు తీసుకొని చెట్లను తొలగించాల్సి ఉంటుంది. అటవీ చట్టాలకు విరుద్ధంగా అక్కలాయిగూడెం పాఠశాలలో చెట్లను నరికివేసి సొమ్మును స్వాహా చేశారు. కనీసం ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా, అక్రమంగా విక్రయించుకోవడం వివాదంగా మారింది. విచారణ సవ్యంగా సాగకుండా రాజకీయ నేతలతో పాటు ఒకటి రెండు ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా ఒత్తిడి తీసుకొస్తున్నట్లు చర్చ సాగుతోంది. పాఠశాల కమిటీ ఇచ్చిన తీర్మానం కూడా వివాదంగా మారిన అనంతరం అప్పటికప్పుడే తయారు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ఫారెస్టు అధికారులు సైతం చట్టాల ప్రకారం భారీ జరిమానా విధించాల్సి ఉన్నా చెట్ల సంఖ్య పూర్తిగా తేల్చకముందే కేవలం ఆరు చెట్లకు మాత్రమే జరిమానా విధించారు. 1967 చట్టం, 2002 వాల్టా చట్టం ప్రకారం వేప చెట్ల వంటి రక్షిత చెట్లను నరకాలంటే ఫారెస్టు అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. కానీ ఈ చెట్ల వల్ల విద్యార్థులపై పురుగులు పడుతున్నాయని, అర్థం పర్థం లేని లేని కారణాలు చూపించి కొంతమంది పేరెంట్స్‌తో లేఖ రాసి తీర్మానం చేయడం గమనార్హం.

ఏకగ్రీవాలు ఉండేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం మాత్రం ఇస్తుందనే నమ్మకమేంటని కొందరు వాదిస్తున్నారు.

గతంలో 237 పంచాయతీలు ఏకగ్రీవం

గత పంచాయతీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో 837 పంచాయతీలకు 120, సూర్యాపేట జిల్లాలో 475 పంచాయతీలకు 54, యాదాద్రి జిల్లాలో 427 పంచాయతీలకు 63 ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన మొత్తం 237 పంచాయతీలకు ప్రభుత్వంగానీ, ప్రజాప్రతినిధులుగాని ప్రోత్సాహక నిధులు ఇవ్వలేదు. సర్పంచ్‌లు ఎన్నో పర్యాయాలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో, సంబంధిత ఉన్నతాధిరుల వద్ద, ఇతర వేదికలపై ఈ విషయాన్ని ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయింది.

నలుగురికి పునర్జన్మ



ఉపేంద్ర (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): తాను చనిపోతూ నలుగురికి పునర్జన్మనిచ్చింది యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కల్లెపల్లి ఉపేంద్ర(43). ఉపేంద్ర భర్త కల్లెపల్లి అయిలయ్యతో కలిసి ఈ నెల 16వ తేదీన ద్విచక్రవాహనంపై హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరు వైపు నుంచి రామాజీపేటకు వస్తుండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 10 రోజులుగా హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఈ నెల 25న కల్లెపల్లి ఉపేంద్రకు బ్రెయిన్‌డెడ్ అయింది. తన భార్య అవయవాలు దానం చేసేందుకు భర్త అయిలయ్య ముందుకొచ్చారు. కాలేయం, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులను దానం చేసినట్లు తెలిపారు.

జాతీయ డ్రాగన్ బోట్ పోటీల్లో పతకాలు



పతకాలతో రేవంత్

రాజాపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మూడావత్ రేవంత్ డ్రాగన్ బోట్ పోటీలో జాతీయ స్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించాడు. ఈ నెల 24నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరుగుతున్న 12వ జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టులో పాల్గొని పతకాన్ని సాధించాడు. సీనియర్ మెన్ 1000 మీటర్ల విభాగంలో రజత పతకం, 500 మీటర్ల విభాగంలో కాంస్య, సీనియర్ మిక్స్‌డ్ 1000 మీటర్ల విభాగంలో కాంస్య పతకాలు సాధించాడు.

పాఠశాలల్లో 'అధ్యక్షా'...

● పలు పాఠశాలల్లో ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంట్, అసెంబ్లీ



హుజూర్‌నగర్‌లో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

మర్రిగూడ, హుజూర్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లిలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. వివిధ అంశాలపై విద్యార్థులు చర్చల్లో పాల్గొని అనేక విషయాలను లేవనెత్తారు. అధికార, విపక్ష ఎమ్మెల్యే పాత్ర వహించి ఆకట్టుకున్నారు. స్పీకర్‌గా బి. కార్తీక్, మంత్రులుగా అఖిల్ అన్న, చేతన్‌గౌడ్, రాహుల్, దీప్తి, మదిహ, ఎమ్మెల్యేలుగా వైష్ణవి, తన్సిక, అలీ, అఖిల్‌గౌడ్, శివ, టోనీ, సరళిని మహారాణి, తనుశ్రీ, ఆద్యశ్రీ వ్యవహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్, ఉపాధ్యాయులు కొండ శ్రీనివాస్, సభావత్ వెంకట్‌కుమార్ విద్యార్థులతో భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనాబేగం, శైలజ, నస్రీన్, జయ, నాగజ్యోతి, సునీత, భవాని, ఉష, కల్యాణి, స్వప్న, వసంత, దివ్య పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ దందా

● రైతులు విక్రయించే పత్తికి అభ్యంతరాలు ● దళారులు తెస్తే వెంటనే కొనుగోలు ● కొంపల్లి సీసీఐ కేంద్రం నిర్వాహకుల ఇష్టారాజ్యం



కొంపెల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట బారులు తీరిన రైతులు తెచ్చిన పత్తి ట్రాక్టర్లు

మునుగోడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ దందా కొనసాగుతోంది. పత్తి విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా దళారులు కొత్త రకం ఎత్తులు వేస్తున్నారు. రైతులను నమ్మబలికి బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని రైతుల పేరున సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో దర్జాగా విక్రయిస్తున్నారు. అద్దె మిల్లులు నడుపుతున్న నిర్వాహకులతో కుమ్మక్కై ఈ దందా నడుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బహిరంగంగా సాగుతున్న ఈ దందాపై అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం పరిధిలో దందా బహిరంగంగా సాగుతోంది. మర్రిగూడ మండలం లోని కొంపల్లిలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి జిన్నింగ్ మిల్లులో మంగళవారం ఉదయం 6గంటల సమయంలో 11డీసీఎం వాహనాల్లో దళారులు తెచ్చిన పత్తి దిగుమతి చేశారు. ఈ వ్యవహారంపై ప్రశ్నిస్తే సమాధానం చెప్ప కుండా దాటవేశారని కొందరు రైతులు చెబుతున్నారు. మరికొందరు ఫోన్‌లో ఫొటోలు తీసే క్రమంలో సీసీఐ స్లాట్ బుకింగ్ అంటూనే దాటవేస్తూ దిగుమతి చేసే డీసీఎం వాహనాలను మిల్లులోంచి బయటకు తరలించారు. ఏమిటని ప్రశ్నిస్తే సమాధానం దాట వేస్తున్నారు. ఆ సమయంలో వందల సంఖ్యలో రైతులు తెచ్చిన పత్తి వాహనాలు మిల్లు ఎదుట బారులు తీరి ఉండడం గమ నార్హం. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి దిగుమతులకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే. కానీ ఆ నిబంధనలు ఏమీ పట్టించుకోకుండా మిల్లు నిర్వాహకులు పత్తి దిగు మతి చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నా యి. రైతులు తెచ్చిన పత్తికి వివిధ రకాల సాకులు చెప్పడం, దళారులు తెచ్చిన పత్తికి మాత్రం అభ్యంతరం చెప్పకపోడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల అమాయకతను ఆసరా చేసుకొని తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని మళ్లీ ఈ కొనుగోలు కేంద్రంలోనే రైతుల పేరునే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి.

స్లాట్ బుకింగ్‌లో రైతుల పేరున లెక్కకట్టి..

సీజన్ ఆరంభంలో డీసీఎం వాహనాల ద్వారా కొనుగోలు చేసుకొని వచ్చిన తర్వాత పరిసర ప్రాంతంలో అనువైన చోట ట్రాక్టర్లకు లోడ్ చేసుకొని విక్రయాలు సాగించారు. కొద్ది రోజులుగా డీసీఎం వాహనాలనే ఏకంగా కొనుగోలు కేంద్రంలోకి నేరుగా తీసుకొచ్చి సాగుతోందని తెలుస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తికి సీసీఐ కేంద్రంలో విక్రయించిన ధరకు సుమారు రూ.2వేల నుంచి రూ. 3వేల వరకు వ్యత్యాసం ఉంటుందని సమాచారం. ప్రతిరోజూ పదుల సంఖ్యలో డీసీఎం వాహనాలు తెచ్చి విక్రయాలు సాగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. మిల్లు అద్దె నిర్వాహకులు అంతా తామై నడుపుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు కొనుగోలు డీసీఎం వాహనాల్లో తెచ్చిన పత్తిని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో దిగుమతి చేస్తున్నారు. తర్వాత రైతుల పేరున స్లాట్ బుకింగ్ చేసి అధికారంగా విక్రయాలు జరిపినట్లు లెక్కకట్టేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనల్లో లొసుగులను ఆసరా చేసుకొన్న దళారులు మిల్లు నిర్వాహకులు కలిసి చేస్తున్నారని పలువురు అంటున్నారు.

● ఈ వ్యవహారంపై కొంపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం బయ్యర్ నింజేను ఫోన్‌లో ప్రశ్నించగా కొనుగోలు కేంద్రంలో పత్తిని ఉదయం మాత్రమే కొనుగోలు చేస్తామని, రాత్రి వేళల్లో కొనుగోలు చేయబోమని సమాధానం దాటవేశారు.

కూర'గాయాలు'

- మార్కెట్‌లో మండిపోతున్న ధరలు
- చిక్కుడుకాయ కిలో రూ.120పైనే
- మిగతా కూరగాయలన్నీ కిలో రూ.60 నుంచి రూ.80
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులు

నల్లగొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ఏడాది జూన్, జూలై మాసంలో వర్షాలు కురవక పోవడం, ఆగస్టు నుంచి తర్వాత వరసగా అక్టోబరు వరకు అకాల, అధిక వర్షాలతో కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. దిగుబడి తగ్గడంతో పాటు తెగుళ్ల కారణంగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఉన్న అరకొర కూరగాయల సాగు దెబ్బతిన్నది. దీంతో హైదరాబాద్‌తో పాటు ఇతర సరిహద్దు జిల్లాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూడా వ్యాపారులు కూరగాయలను తీసుకొచ్చి అమ్ముతున్నారు. సాగు తగ్గడంతో పాటు దిగుబడి ప్రభావం వల్ల కొన్ని కూరగాయల ధరలు కిలోకు రూ.60 నుంచి రూ.80 వరకు ఉండగా మరికొన్ని కూరగాయల ధరలు రూ.80 నుంచి రూ.100 పలుకుతున్నాయి. ఇంకా కొన్ని కూరగాయలు అయితే రూ.120పైనే విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కిలో చిక్కుడు కాయను రూ.120కు అమ్ముతుండగా గోకరికాయ, క్యాప్సికం రూ.100 చొప్పున రిటైల్‌గా అమ్మకాలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలల్లోని వీధులో ఉండే షాపులలో అయితే కూరగాయల ధరలు మరింత పెంచి అమ్ముతున్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు అవసరమైన కూరగాయలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది పేద, మధ్య తరగతి ప్రజలు కిలో కూరగాయలు బదులు పావు కిలోతోనే సరి పెట్టుకుంటున్నారు.



ప్రతీ కూరగాయకు కిలోకు రూ. 60 నుంచి 80 పైనే

టమాట నెల రోజుల క్రితం వరకు రూ. 20 నుంచి రూ.25 వరకు ఉండేది. ప్రస్తుతం కిలో టమాట రూ.60 పలుకుతోంది. అలాగే అన్ని కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి తీసుకవచ్చే బీన్నీస్‌తో పాటు ఇతర కూరగాయలు మరింత రెట్టింపు ధరతో అమ్ముతున్నారు. ఆకుకూరల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. గోంగూర చిన్న కట్టను రూ.25, పాలకూర కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో ఆకు కూరలు నాలుగు కట్టలను రూ.20 వరకు విక్రయిస్తుండగా ప్రస్తుతం రెండు కూడా ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. చాలీ చాలని ఆదాయంతో ఉన్న పేద, మధ్య తరగతి వారు కూరగాయలను కొనుగోలు చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు కూరగాయల ధరలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూరగాయలు	కిలో ధర రూ.
టమాట	60
బెండకాయ	60
దోసకాయ	60
దొండ (పెద్ద)	60
దొండ (సన్న)	40
క్యాబేజీ	50
ఆలుగడ్డ	40
బీట్‌రూట్	80
క్యారెట్	80
క్యాబేజీ	100
సొరకాయ	60
వంకాయలు	60
బీరకాయ	60
చామగడ్డ	60
పొట్లకాయ	80

సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితి



కూరగాయల ధరలు రోజురోజుకు రెట్టింపవుతూ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతుండటంతో ఆందోళన కలిగిస్తోంది. పెరిగిన ధరల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికభారం పడుతుంది. మూడు జిల్లాల్లో కొద్ది రోజుల క్రితం వరకు కూరగాయల ధరలు ఒక మోస్తారుగా ఉండగా ప్రస్తుతం అమాంతంగా పెరిగి రెట్టింపయ్యాయి. ఇకపోతే ప్రభుత్వంతో పాటు ఉద్యానశాఖ కూరగాయల సాగుపై రైతులను ప్రోత్సహించక పోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూరగాయల విస్తీర్ణం పెరగడం లేదు. ఉమ్మడి జిల్లా హైదరాబాద్ వంటి నగరానికి సరిహద్దులో ఉన్నా కూరగాయల సాగు పెరగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి, హైదరాబాద్ సరిహద్దులో ఉన్న నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాలో పలు గ్రామాలను హబ్‌గా మార్చి కూరగాయల సాగు ప్రోత్సహించినట్లు చెప్పినా ఆ తర్వాత ఆ పథకం అటకెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆ ప్రయత్నాలు చేసినా ఇప్పటి వరకు కూడా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కనీసం 5నుంచి 6 వేల ఎకరాలల్లో కూడా కూరగాయల సాగు కావడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని ప్రాంతాల్లో కేవలం ఆకు కూరలు మాత్రమే సాగు చేస్తున్నారు తప్ప ఇతర కూరగాయల జోలికి రైతులు వెళ్లని పరిస్థితి ఉంది. దీంతో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇతర రాష్ట్రాలు, ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి.

ధరలను నియంత్రించాలి



నెల క్రితం ఉన్న ధరలకు ప్రస్తుత ధరలకు భారీ వ్యత్యాసం ఉంది. అధిక వర్షాలతో దిగుబడి తగ్గినట్లు కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పెరగడం వల్ల ఆర్థికభారం పడుతోంది. జిల్లా అధికారులు ధరలను తగ్గించడం కోసం చర్యలు తీసుకోవాలి. జిల్లాలో కూరగాయల సాగు తగ్గడంతో ఉత్పత్తులు లేక పోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకరావడం వల్ల ధరలు మండిపోతున్నాయి.

\- డి.శేషగిరిరావు, నల్లగొండ

కొనలేక పోతున్నాం



కూరగాయల ధరలు పెరగడం వల్ల కొనుగోలు చేయలేకపోతున్నాం. తక్కువ ధరలు ఉన్న కూరగాయలు ఒక్కటి కూడా లేదు. దీంతో సామాన్య ప్రజలకు కూరగాయలు కొనుగోలు చేయాలంటేనే వెనకడుగు వేసే పరిస్థితి ఉంది. నెల రోజులుగా ధరలు మండిపోతున్నాయి. ప్రతీ కూరగాయ ధర రూ.60లకు పైనే ఉంటుంది. దీంతో పావు కిలో చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ధరలు తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- ఎం. మల్లీశ్వరి, నల్లగొండ

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	582.20 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	4160 క్యూసెక్కులు
కుడికాల్వకు	9500క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	20056 క్యూసెక్కులు
సాగర్‌కు నీటి రాక	35,516 క్యూసెక్కులు
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	35,516 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్

\- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు

\- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.40 అడుగులు
నీటి రాక	1171.98 క్యూసెక్కులు
గేట్ల ద్వారా విడుదల	1 గేటు
నీటి విడుదల	708.59 క్యూసెక్కులు

\- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

\-శాలిగౌరారం

పదవులు కాదు పార్టీయే ముఖ్యం

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

భువనగిరి గంజ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పదవులు ముఖ్యం కాదు పార్టీయే ముఖ్యమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పదవీ త్యాగాలు చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన మహానాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు గులాబీ జెండా రెపరెపలాడిందన్నారు. దీక్షాదివస్ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిందని ఆయన గుర్తు చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ఆనాడు ఉద్యమం చేసి, మాజీ సీఎం కేసీఆర్ ప్రాణాలు పనంగా పెట్టి తెలంగాణ సాధించారన్నారు. ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందని, రాష్ట్రం ఏర్పాటు చేస్తామని కేంద్రప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసిందన్నారు. తెలంగాణ అంటేనే కేసీఆర్ అని నేటి తరానికి తెలిసే విధంగా తెలంగాణ ఉద్యమ చరిత్రను తెలిసే విధంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ నెల 29న నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, గాదరి కిషోర్, బూడిద బిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు క్యామ మల్లేష్, కొలుపుల అమరేందర్, సందీప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరయ్యారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 15,58,975 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

కమనీయం మట్టపల్లి లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీ నృసింహుని క్షేత్రంలో రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుని నిత్య కల్యాణాన్ని బుధవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో అజ్మీరజ్యోతి పాల్గొన్నారు.

ఏకగ్రీవం చేస్తే నజరానాలు

- రూ.40 నుంచి రూ.80 లక్షలు
- బాహాటంగా ప్రకటిస్తున్న ఆశావహులు



కేతేపల్లిలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

మర్రిగూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించినందున గ్రామాల్లో గ్రామపంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి బరిలో ఉండటానికి సిద్ధంగా ఉన్న ఆశావహులు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే శ్మశానవాటిక ఏర్పాటు కోసం ఎకరం భూమి, రూ.40 నుంచి రూ.80 లక్షల వరకు అభివృద్ధి కోసం ఇస్తామని ముందుకు వస్తున్నారు. కొంతమంది బహిర్గతంగా, మరికొంత మంది సోషల్ మీడియాలో ఆఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువత నేరుగా ఆఫర్ చేస్తుండటంతో అటు గ్రామాల్లో ఇటు సోషల్‌మీడియాలో హల్‌చల్ అవుతుంది. గ్రామపంచాయతీ ఎన్నికల పోరులో ఎన్నడూ ఆసక్తి చూపని వ్యక్తులు కూడా సర్పంచ్ ఎన్నికల బరిలో ఉండి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. మండలంలోని రాజపేటతండా, వట్టిపల్లి, గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో కూడా సర్పంచ్‌గా పోటీ చేయాలనే అభ్యర్థులు బహిర్గతంగానే ఆఫర్లు చేస్తున్నారు. ముఖ్యంగా యువత, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్ పదవికి మొగ్గు చూపడంతో పలు గ్రామాలలో ఎన్నికల హడావుడితో పాటు ఆసక్తికరంగా మారింది.

అభ్యర్థుల ఎంపికకు సమావేశాలు

కేతేపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేయడం స్థానికంగా నాయకులకు పరీక్షగా మారింది. కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా 160 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటికి డిసెంబరు 11వ తేదీన తొలి విడతలో ఎన్నికలు జరగనుండగా గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీంతో గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలు తమ పార్టీ పక్షాన సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీలో నిలిపే అభ్యర్థుల ఎంపిక కార్యక్రమాన్ని ముమ్మరం చేశాయి. ఎన్నికల్లో పార్టీ గుర్తులు లేకున్నా పార్టీ సానుభూతి పరులు, నాయకుల నుంచి ఏకాభిప్రాయంతో అన్ని విధాలా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల నాయకులు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీలైన భీమారం, ఇనుపాముల, కేతేపల్లి, చెరుకుపల్లి గ్రామ పంచాయతీలకు నాయకులు అధిక సంఖ్యలో పోటీకి ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల తాకిడి అధికంగా ఉండనుంది.

ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లకు అనుగుణంగా పార్టీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తు చేపట్టాయి. ఈ క్రమంలో సర్పంచ్ పదవికి ఎవరెవరు పోటీలో ఉన్నారు. వార్డులకు ఎవరిని ఏ వార్డులో పోటీలో నిలిపితే గెలుపు సులువవుతుందని విషయాలను చర్చిస్తున్నారు.

నామినేషన్ నిబంధనలివే..!

నార్కట్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నారా... అభ్యర్థులు నామినేషన్‌ల దాఖలు కోసం ఈ నిబంధనలు పాటించాల్సిందే...

నామినేషన్ వేసేందుకు ...

- పోటీ చేయాల్సిన అభ్యర్థి ఖచ్చితంగా 21 వయస్సు నిండి ఉండాలి.
- సంబంధిత గ్రామ ఓటరు లిస్టులో ఓటరై ఉండాలి.
- వార్డు సభ్యులకైతే ఆ వార్డులో ఉండే ఓటరే ప్రతిపాదించాలి, బలపరచాలి.
- షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల వారు కుల ధ్రువీకరణ పత్రాలు జతపరచాలి.
- బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలి.
- ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఎన్నికల్లో ఖర్చు చేస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి.
- పంచాయతీ నుండి నో డ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాలి, పాస్‌ఫోటో అతికించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు షెడ్యూల్డ్ కులాలు, తెగ లు, వెనుకబడిన వర్గాల వారైతే సర్పంచ్ స్థానానికి రూ.వెయ్యి, వార్డు స్థానానికి రూ.240 డిపాజిట్ చేయాలి.
- జనరల్ కేటగిరీకి చెందిన వారైతే సర్పంచ్ స్థా నానికి రూ.2వేలు, వార్డు స్థానానికి రూ.500లు డిపాజిట్ చేయాలి.

నామినేషన్ పత్రంలో ఉండే అంశాలు

- పార్ట్-1లో ప్రతిపాదకుడు సంతకం చేయాలి.
- పార్ట్-2లో అభ్యర్థి సంతకం చేయాలి.
- పార్ట్-3లో పోటీ చేసే అభ్యర్థి సంతకం ఉండాలి.
- పార్ట్-4లో రిటర్నింగ్ అధికారి సంతకం చేయాలి.
- పార్ట్-5లో తిరస్కరించిన నామినేషన్ కారణాల్లో ఆర్‌వో సంతకం ఉండాలి.
- పార్ట్-6లో (రిసిప్ట్) ఆర్‌వో సంతకం ఉండాలి.
- అఫిడవిట్‌లో ఇద్దరు సాక్షుల సంతకం ఉండాలి.
- ఎన్నికల ఖర్చు డిక్లరేషన్‌పై అభ్యర్థి సంతకం చేయాలి.

జాతీయ స్థాయి

కబడ్డీ పోటీలకు వరుణ్ ఎంపిక



వరుణ్

నేరేడుచర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన వరాల వరుణ్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో హర్యానాలో జరగనున్న 35వ సబ్ జూనియర్స్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు వరుణ్ తెలిపా రు. ఎంపికైన వరుణ్‌ను కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, కార్యదర్శి సైదులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడలకు అజయ్



అజయ్

తుర్కపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎన్ఐఎస్ కోచ్ దండ్ల అజయ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 11న నిర్వహించిన 12వ సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో దండ్ల అజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఆదిలాబాద్ జిల్లాలోని టీటీడబ్ల్యూయూ ఆర్‌జేసీ (బి) ఈసీహోండాలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించే 2025 - 26 తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఇంట ర్ డిస్టిక్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అజయ్ పాల్గొననున్నట్లల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ వీరేశం అజయ్ తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

సందేశానికో సంకేతం

- సంక్షిప్త సందేశంలో బోలెడు సమాచారం
- తెలుసుకోవాలంటున్న సైబర్ నిపుణులు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ఏదైనా సమాచారాన్ని ఇతరులకు త్వరగా తెలియజేయాలంటే మెసేజ్ ఒక సులభమైన మార్గం. ఇప్పుడు ఉన్న సాంకేతికతతో వాట్సాప్, టెలిగ్రామ్ ఇన్‌స్టా,ఫేస్‌బుక్‌లాంటి యాప్‌ల ద్వారా మెసేజ్‌లు పంపడం చాలా తేలికగా అయిపోయింది. అయితే స్మార్ట్ ఫోనైనా, సాధారణ సెల్ అయినా.. రేయింబవళ్లు మెసేజ్ లు వస్తూనే ఉంటాయి. వాటిలో ఏవీ మంచివో, ఏవీ ఖాతాలు ఖాళీ చేసేవో తెలియని పరిస్థితి నెలకొంది. వాట్సాప్, టెలిగ్రామ్ యాప్స్ అందుబాటులోకి రాకముందు సాధారణ సంక్షిప్త సమాచారం పంపుకునే వా ళ్లు ఇప్పుడెవరికి ఎవరూ సాధారణ మెసేజ్ పంపడం లేదు. అయితే అప్రమత్తం చేసే (అలర్ట్)వో, ప్రచారం కోసం వచ్చేవో, ప్రభుత్వ పరంగా పంపేవో ఉంటున్నాయి. అంతకుమించి సంక్షిప్త సందేశాలొస్తే..అవి సాంకేతికతను పొణికిపుచ్చుకున్న సైబర్ నేరస్తులే పంపినవే కావడం గమనార్హం.

సమయం వృథా కాకుండా..

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ బిజీగా మారారు. తమ, తమ పనుల్లో తీరిక లేకుండా కనిపిస్తున్నారు. ఈ తరుణంలో వచ్చే మెసేజ్‌లను చూసుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు. వచ్చే మెసేజులు ప్రాధాన్యం అసలే అర్థం కాదు. ఎవరు పంపుతున్నారో, ఎందుకు వస్తున్నాయో తెలియని తరుణంలో ఆయా సంక్షిప్త సందేశాలను అందుకునే ఫోన్ వినియోగదారులకు సందేశమిచ్చేలా ఆంగ్ల అక్షరాలను జత చేసింది.



కట్టడి చేసేందుకు..

అనవసరపు, అర్థంలేని, అయోమయానికి గురి చేసే మెసేజ్‌లను కట్టడి చేసేందుకు ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) మార్గదర్శకాలను జారీ చేసింది. ఫోన్లకు వచ్చే సంక్షిప్త సందేశాలను సులభంగా గుర్తు పట్టేలా, స్పామ్, మోసపూరిత మెసేజ్‌లు వేరు చేసేలా చర్యలు చేపట్టి అమలు చేస్తోంది. మెసేజ్‌లోని సందేశానికి చివరిలో ఆంగ్ల అక్షరాన్ని చేర్చింది. మెసేజ్ చివరిలో జీ అంటే గవర్నమెంట్ (ప్రభుత్వం) అని, ఎస్ అంటే సర్వీసు(సేవలు) అని, పీ అంటే ప్రమోషన్స్(ప్రచారం) అని, టీ అంటే ట్రాంజెక్షన్ (లావాదేవీలు) అని సూచిస్తూ సంక్షిప్త సందేశాలు అందేలా నిబంధనలు విధించింది. ఇకపై జీ, ఎస్, పీ, టీ లేకుండా నేరుగా మెసేజ్ అన్నదే రాదన్నమాట.

సంకేతాలకు అర్థం ఇదే

- ఎస్ ఉంటే.. సర్వీస్ మెసేజెస్ అన్న మాట. అంటే బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, టెలికాం సేవలు, ఓటీపీలకు సంబంధించిన సమాచారం చేరవేసే సంక్షిప్త సందేశాలు.
- పీ ఉంటే.. ప్రమోషనల్ మెసేజెస్. సేల్స్, మార్కెటింగ్, ఆఫర్లు, డిస్కౌంట్లకు సంబంధించిన సంక్షిప్త సందేశాలు.
- టీ ఉంటే.. ట్రాంజెక్షన్స్‌కు సంబంధించినవి. ఆర్థిక లావాదేవీలు. బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి వచ్చే ఎలర్ట్స్
- జీ అంటే.. గవర్నమెంట్.. ప్రభుత్వం నుంచి వచ్చే అధికారిక సమాచారం, హెచ్చరికలు, సూచనలు. ఇవి ఉపయోగకరమైనవే. ఎలాంటి సందేహం లేకుండా చూడొచ్చంటున్నారు పోలీసులు.

అప్రమత్తతతో బోలెడంత రక్షణ



అందుబాటులోకి వస్తున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఆయా నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలు నష్టపోకుండా సలహాలు, సూచనలు అందిస్తున్నాయి. సోషల్‌మీడియా ద్వారా అవగాహన పెంచడంతో పాటు సంక్షిప్త సందేశాలనూ గుర్తించే విధంగా అక్షరాలను చేర్చాయి. వినియోగదారులు చేయాల్సిందల్లా కాస్త అప్రమత్తంగా ఉండటమే.

\- రాజశేఖరరాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

● దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి ● గ్రామాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నది.

కేతేపల్లి, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామాలకు చెందిన వారు పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు ఐదు క్లస్టర్‌లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. 16 గ్రామ సర్పంచ్ పదవులు, 160 వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేయడానికి మండల కేంద్రం కేతేపల్లి, కొత్తపేట, తుంగతుర్తి, ఇనుపాముల, చెరుకుపల్లి గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. కాగా తొలివిడతలో నిర్వహించే ఈ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు ఇప్పటికే మండలానికి చేరాయి. మండల పరిషత్ సమావేశ మందిరంలో వీటిని భద్రపరిచారు. పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ సందర్భంగా వీటిని డిస్ట్రిబ్యూటరీ కేంద్రానికి చేర్చనున్నారు.



చిట్యాల: ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ సామగ్రిని అందజేస్తున్న ఎంపీడీవో జయలక్ష్మి

● **శాలిగౌరారం:** మండలంలోని 24 గ్రామపంచాయతీ సర్పంచులు, 230 వార్డు సభ్యులకు గురువారం నుంచి 29 వరకు క్లస్టర్ వారీగా నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి తెలిపారు. అన్ని పార్టీల నాయకులు ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

● **నార్కట్‌పల్లి:** మండలంలో అమ్మనబోలు, అక్కెనపల్లి, తొండ్లాయి, నెమ్మాని, నార్కట్‌పల్లి, చిన్ననారాయణపురం, బి.వెల్లెంల, ఎల్లారెడ్డిగూడెంలో మొత్తం 8 చోట్ల నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కత్తు రోజు ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్ తెలిపారు. బుధవారం తమ కార్యాలయ ంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ తదితర అంశాలకు సంబంధించి వివరాలను తెలిపారు. నా మినేషన్ల దాఖలు సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించి ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు.

● **తిప్పర్తి:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తిప్పర్తి ఎస్ఐ శంకర్ తెలిపారు. మండలంలో మొత్తం మామిడాల, ఎల్లమ్మగూడెం, తిప్పర్తి, తానేదార్‌పల్లి, జం గారెడ్డిగూడెం, పజ్జూరు, రాజుపేట, పెద్దసూరారంతో కలిపి 8 కేంద్రాల్లో ఈ నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు.

● **కట్టంగూరు:** మండలంలో 6 క్లస్టర్లు విభజించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు బుధవారం తెలిపారు. సర్పంచ్ పదవి పోటీకి చేసే జనరల్ అభ్యర్థులు డిపాజిట్ రూ.2000, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000, వార్డు సభ్యులు జనరల్‌కు రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థు లు రూ.250 చొప్పున డిపాజిట్ చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

● **చిట్యాలరూరల్:** స్థానిక సంస్థల ఎన్నికల సామాగ్రిని బుధవారం చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో క్లస్టర్ల వారీగా ఆర్‌ఓలకు ఎంపీడీఓ ఎస్‌పీ జయలక్ష్మి పంపిణీ చేశారు. మండలంలో 18 గ్రామాలుండగా 3 గ్రామాలను కలిపి 6 క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. నామినేషన్‌కు దాఖలు చేసే అభ్యర్థులకు అందజేసే పత్రాలకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అనుముల కోటేష్, ఎంఈఓ పానుగోతు సైదానాయక్, గంపల మనోహర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **కనగల్:** మండలంలో 31 పంచాయతీలు ఉండగా



నల్లగొండ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న యాకూబ్‌నాయక్

సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు 9 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఈనెల 27,28,29 తేదీల్లో మూడు రోజుల పాటు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు మండల ఎన్నికల అధికారి(ఎంపీడీఓ) వేద రక్షిత తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి - ఎస్ఐ

సర్పంచ్‌ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ పాటించాలని ఎస్ఐ రాజీవ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నామినేషన్ల సెంటర్‌లోకి అభ్యర్థితో పాటు అతడిని బలపరిచే మరో ఇద్దరికి అనుమతి ఉంటుందని తెలిపారు. వంద మీటర్ల లోపలికి వాహనాల అనుమతి ఉండదన్నారు. సౌండ్ బాక్స్‌లకు అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లఘింస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



పుట్ట రాములు



కృష్ణ

కట్టంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ కట్టంగూరు మండల కమిటీని బుధవారం నల్లగొండలోని ఆ సంఘం భవనంలో నిర్వహించిన మహాసభలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుగినవెల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు పుట్ట రాములు, ప్రధాన కార్యదర్శిగా ఎంపీపీఎస్ నారెగూడెం ఉపాధ్యాయుడు దేశపాక కృష్ణ, ఉపాధ్యక్షులుగా యుపీ కనకదుర్గ, పోషం సైదులు, కోశాధికారిగా కొండ్ర నాగలక్ష్మి ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా ఎం.సౌజన్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా కక్కిరేణి శ్రీనివాసులు, మండల కార్యదర్శులుగా జె.మీనయ్య, వి.మాణిక్యం, ఎం.నాగేశ్వర్‌రావు, ఎశైలజ, డి. జగదీష్ ఎన్నికయ్యారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని మండలంలోని చెర్వుగట్టు సమీపంలో గల శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి దౌల్తాబాద్ వాసుదేవశర్మ, రఘుశర్మ యాజ్ఞీకంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్సవానికి ముందు సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు జయారపు కృష్ణయ్య, రామకృష్ణ, హరిప్రసాద్, తేరటుపల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

● **కనగల్:** దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్టి ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి స్వామివారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలను జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు మొక్కుబడి కళ్యాణాలను అర్చకులు ఉమామహేష్, దామోదార్‌రావు ఆధ్వర్యంలో జరిపించారు. అమ్మవారికి చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలను సమర్పించుకుని మొక్కు చెల్లించుకున్నారు. కాగా భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

సత్యనారాయణస్వామి విగ్రహానికి జలాధివాసం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠించనున్న సత్యనారాయణస్వామి విగ్రహానికి బుధవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణతో అంకురార్పణ చేశారు. అనంతరం సత్యనారాయణమూర్తి ప్రతిష్ఠ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి బెల్లి వెంకన్న, మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బెనిఫిట్స్ వెంటనే అందజేయాలి



మంత్రిని కలిసిన సంఘం పెన్షనర్స్ సంఘం నాయకులు

నల్లగొండకల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బెనిఫిట్స్‌ను వెంటనే అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం కోరారు. సంఘం జిల్లా, మండల కార్యవర్గాలు బుధవారం మంత్రి వెంకట్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్స్ సంఘ భవనం రెండో అంతస్థు నిర్మాణం, లిఫ్ట ఏర్పాటు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2024లో ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్, ఈహెచ్‌ఎస్, వెల్‌నెస్ సెంటర్‌లో మందుల సరఫరా వంటి విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి స త్యం, యాద వాసుదేవ్, సంఘం నాయకులు యాదగిరి, మోహన్‌రావు, కృష్ణయ్య, పుల్లయ్య, చంద్రమౌళి, రమేష్, అజమ్‌అలీ, రవిప్రసాద్, శంకరయ్య, వేణు, నారాయణరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

రామగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాలబావి గ్రామంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయంలో కంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రేణుకా ఎల్లమ్మతల్లి, మైసమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా మొకు,ముస్తాదు, శివ వృక్షపూజ కార్యక్రమాలను చేపట్టనున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారు. గౌడ కులస్థులు శివమాల ధరించి ఆలయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాజీ కౌన్సిలర్ జెర్రిపోతుల భాస్కర్‌గౌడ్ దంపతులు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ సైదిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వహణ కమిటీ సభ్యులు సురికి రవి, లింగస్వామి, జెర్రిపోతుల హరీష్, సైదులు, జెర్రిపోతుల భిక్షం, వెంకన్న, నర్సింహ తదితరులు ఉన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్జాలబావి గౌడ కులస్థులు

నామినేషన్లకు వేళాయె..

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

పోటీకి సై అంటున్న బీఆర్ఎస్

ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు సైతం గ్రామపంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. అన్ని పంచాయతీలు, వార్డుస్థానాల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకునేందుకు నేతలు సిద్ధమయ్యారు. మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమావేశాలు ఏర్పాటు చేశారు. బలమైన అభ్యర్థులను బరిలో నిలపాలని, కాంగ్రె‌స్‌పై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికార పార్టీ అమలుచేయకపోవడాన్ని పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ధీటైన నాయకత్వం ఉందని, బీఆర్ఎ‌స్‌కు గ్రామాల్లో పట్టు నిలబెట్టేలా ఈ ఎన్నికల్లో బరిలో నిలవాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. బలమైన అభ్యర్థులను నిలబెట్టందుకు మాజీ ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చాటి చెప్పాలని, ఈ రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని వైనాన్ని ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ముందుకు తెస్తోంది. మొత్తానికి అన్ని పంచాయతీల్లో బలమైన పోటీకి బీఆర్ఎస్ సిద్ధమైంది.

అన్ని సీట్లలో పోటీచేసేందుకు బీజేపీ సన్నాహాలు

జిల్లా రాజకీయాలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్న బీజేపీ ఈ ఎన్నికలను అందుకు వినియోగించుకోవాలని చూస్తోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉండడంతో, ఈ దఫా ఆసక్తి ఉన్న పార్టీ నాయకులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వందశాతం కేంద్రం నిధులే వస్తున్నాయని, కేంద్ర ఆర్థిక సంఘం, మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న నిధులతోనే గత పదేళ్ల నుంచి పంచాయతీల్లో పరిపాలన కొనసాగిందని, అభివృద్ధి పనులు చేశారనే అంశాన్ని ఈ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే 20 నెలలుగా నిధులు నిలిచి గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందనే వాదన బీజేపీ నుంచి వినిపిస్తోంది. తాజాగా ఈ ఎన్నికల్లో ఇవే అంశాలు ఏజెండాగా బీజేపీ ప్రచారం చేయనుండడంతో పంచాయతీ పోరు రక్తికట్టనుంది.

సత్తాచాటాలని నిర్ణయించిన సీపీఎం, సీపీఐ

అధికార కాంగ్రె‌స్‌కు మిత్రపక్షంగా ఉన్న సీపీఐ ఈ ఎన్నికల్లోనూ కాంగ్రె‌స్‌తో పాటు, సీపీఎంతోనూ కలిసి పోటీకి సిద్ధమైంది. పార్టీకి మొదటి నుంచి పట్టున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో ఎక్కువస్థానాల్లో, మిగిలిన చోట్ల బలం కలిగిన గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాల్లో పోటీచేయాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. అదేవిధంగా సీపీఎం సైతం ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతోంది. పార్టీ రహితంగా జరిగే ఎన్నికలు అయినప్పటికీ పోటీకి నాయకులు సిద్ధమయ్యారు. పార్టీ శాఖలు బలంగా ఉన్న గ్రామాల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. సీపీఐతో పొత్తును కొనసాగిస్తూ అన్ని నియోజకవర్గాల్లో పోటీచేయాలని సంకల్పించింది. నామినేషన్ల పర్వం మొదలైతేగానీ అభ్యర్థిత్వాలపై స్పష్టతరానుంది.

ఎన్నికల సమయంలోనే కాంగ్రె‌స్‌కు పథకాలు గుర్తొస్తాయి

జడ్పీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగయ్య

నార్కట్‌పల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నార్కట్‌పల్లిలోని చిరుమర్తి లింగయ్య నివాసంలో బుధవారం నిర్వహించిన చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ప్రభుత్వం చీరల పంపిణీకి తెరలేపిందని అన్నారు. దీంతో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు.

ఎన్నటికైనా ఈ రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్షగా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని నరేందర్‌రెడ్డి, లింగయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీన దీక్షాదివస్‌ను బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, కర్నాటి ఉపేందర్, యానాల అశోక్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక'ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

చండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించి, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. చండూరు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై చండూరు డివిజన్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డితో కలిసి నిర్వహిం చిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటినుంచి గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో భద్రతా ఏర్పాట్లు, కేంద్ర బలగాల మోహరింపు, ఎన్నికల కోడ్ అమలుపై పోలీసుల తీరుపై ఆరా తీశారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోలకి వచ్చిన నేపథ్యంలో అక్రమ మద్యం, నగదుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి శాంతి భద్రతలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే మనకు రక్షణ కవచం



నల్లగొండ : అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేశవులు

మర్రిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగమే మనకు రక్షణ కవచమని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యుడు, దళితరత్న అవార్డు గ్రహీత నాగిన మారయ్య అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం మన దేశానికి జీవననాడిగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల యాదయ్యగౌడ్, యాదయ్య, చెరుకు శ్రీరాములుగౌడ్, షర్ఫుద్దీన్, యూసఫ్, గోపాల్, భాను పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరప్రసాద్ రాజ్యాంగ పీఠికని చదివి వినిపించారు. రాజ్యాంగస్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండ, నల్లగొండరూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల ఆవరణలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్‌వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, యూనివర్సిటీ నల్లగొండ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగం పౌరులందరికీ హక్కులు కల్పించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేష్, సందీప్, క్రాంతి, వంశీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం: తహసీల్దార్ కార్యాలయంలో ప్రమాణం చేస్తున్న సిబ్బంది

ఉద్యమాలకు బీజం వేసింది విద్యార్థులే



దీక్షా దివస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమానికి బీజం వేసింది విద్యార్థులేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు వాడపల్లి నవీన్ అన్నారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఎంజీయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద 2009 నవంబరు 28 నాటి దీక్షాదివస్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సారథ్యంలో నినదించిన కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో ఉద్యమస్ఫూర్తిని మరోసారి గుర్తుచేస్తూ ఈ నెల 29న దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు తె లిపారు. ఎంజీయూలో నిర్వహించే దీక్షా దివస్‌కు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు గాదె శివ, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరు

చిట్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ జినుకుంట్ల జయేందర్, ఎంజీయూ ఉపాధ్యక్షుడు కొంపెల్లి సూర్య అన్నారు. చిట్యాల పట్టణంలో బుధవారం నిర్వహించిన ఏబీవీపీ చిట్యాల పట్టణ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. అనంతరం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాల మల్లేష్, కార్యదర్శి వంగూరి గణేష్, సంయుక్త కార్యదర్శులు సిద్ధు, యశ్వంత్, బాలికల విభాగం కన్వీనర్‌గా సైనోజు కావ్య ఎన్నికయ్యారు.

'బెల్టుషాపులు మూసివేసే వారినే ఎన్నుకోవాలి'

చిట్యాలరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యాన్ని విక్రయించే బెల్టుషాపులను మూసివేయిస్తామనే ప్రమాణం చేసే సర్పంచ్ అభ్యర్థులకే ప్రజలు ఓటేయ్యాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కరించే వారికి, గ్రామాభివృద్ధికి పాటుపడేవారికి పట్టం కట్టాలని అన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు ఉండటం వల్ల ప్రజారోగ్యం, యువత భవిష్యత్తు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం బెల్టుషాపులను మూసివేయిస్తామని ప్రమాణం చేయాలని, అంతేకాకుండా హామీపత్రాన్ని కూడా రాసిచ్చిన వారినే ఎన్నుకోవాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశాంత్రి ఉద్యోగులు

నల్లగొండ, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నల్లగొండ రీజనల్ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు భవనగిరి శంకరయ్య, జిల్లా కార్యదర్శి పల్‌రెడ్డి యాదగిరిరెడ్డి డిమాండ్ చేశారు. సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పీఎఫ్ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కనీస పింఛన్ రూ.7,500 ఇవ్వాలని, డీఏ తర్వాత వారికి ఆరోగ్య వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రీజనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

నార్కట్‌పల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ నేతృత్వంలో వైద్యసిబ్బంది స్టేషన్‌లోనే పోలీస్ సిబ్బందికి వైద్య ఆరోగ్య పరీక్షలు చేశారు. డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని స్టేషన్‌కు తీసుకువచ్చి ఎక్స్‌రే తీశారు. వారికి పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో అజయ్, యాదగిరి తదితర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

కట్టంగూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. కట్టంగూరు హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి పీఎంశ్రీ స్కూల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, పుల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కట్టంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలకు నిర్మూలనకు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి అన్నారు. మండలంలోని బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల అక్రమ రవాణా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు రమాదేవి, కల్పన, శిల్ప, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కూరగాయాలు
» మండిపోతున్న ధరలు
» చిక్కుడుకాయ కిలో రూ.120 7
» మిగతావి కిలో రూ.60పైనే..
చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



నామినేషన్లకు వేళాయె

» నల్లగొండ, చండూరు డివిజన్‌లో తొలివిడత
» 318 సర్పంచ్, 2,870 వార్డులకు నేటి నుంచి నామినేషన్లు
» స్వీకరణకు 117 క్లస్టర్లు ఏర్పాటుచేసిన అధికారులు
» సత్తాచాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ తహతహ
» బలమైన అభ్యర్థులతో రంగంలోకి దిగేందుకు బీఆర్‌ఎస్ సిద్ధం
» గ్రామాలకు కేంద్రమే అండగా ఉందనే నినాదంతో బీజేపీ
» బరిలో నిలిచేందుకు సిద్ధమైన వామపక్షాలు

నల్లగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. పంచాయతీ ఎన్నికలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఇదిలా ఉండగా, 20నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన ఎన్నికలకు కార్యాచరణ మొదలవడంతో రాజకీయవర్గాల్లో సందడి మొదలైంది. సాంకేతికంగా ఈ ఎన్నికలు రాజకీయపార్టీల గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయి. కానీ, రాజకీయపార్టీలు మాత్రం పార్టీల నుంచి అభ్యర్థులను నిలబెట్టి మద్దతు ప్రకటిస్తూ వస్తున్న సంప్రదాయం కొనసాగుతోంది. జిల్లాలో అన్ని రాజకీయపార్టీలూ ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నాయి. పంచాయతీల్లో పార్టీ నేతలే సర్పంచ్‌లుగా ఉంటే కలిసొస్తుందని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తమ ఖాతాలో పడతాయని అధికార కాంగ్రెస్ నేతలు భావిస్తుంటే, తమ అభ్యర్థులు గెలిస్తే పార్టీకి క్షేత్రస్థాయిలో క్యాడర్, ఓటు బ్యాంక్ సురక్షితంగా ఉంటుందని ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ నేతలు భావిస్తున్నారు.

నేటి నుంచి నామినేషన్లు

నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 14 మండలాల పరిధిలో ఉన్న 318 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లను గురువారం ఉదయం నుంచి స్వీకరిస్తారు. 318 సర్పంచ్ స్థానాలు, 2870 వార్డుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించే నిమిత్తం 117 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే నిమిత్తం మూడు, రెండు పంచాయతీలకు ఒక క్లస్టర్‌ని ఏర్పాటు చేశారు. పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు నింపడం, పొరపాట్లు లేకుండా ఉండేందుకు వీలుగా ప్రతి క్లస్టర్ వద్ద హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించే నిమిత్తం నియమ, నిబంధనలు, ప్రవర్తనానియమావళి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు పాటించాల్సిన విధానాలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలకు గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్లు స్వీకరించే క్లస్టర్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్‌బందోబస్తుని ఏర్పాటు చేయనున్నారు.

హవా చాటేందుకు కాంగ్రెస్ యత్నాలు

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపొందగా, అదే ఊపులో తాజాగా సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ విజయం సాధించాలని తహతహలాడుతోంది. ప్రభుత్వంలో తామే ఉన్నామని, మంత్రిగా తానున్నానని, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా తామే అధికారంలో ఉండడంతో పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులుగా కాంగ్రెస్ నాయకులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి, సంక్షేమపథకాల అమలుకు కృషి చేస్తారని, ప్రతిపక్ష నాయకులను గెలిపిస్తే వారికి ఎవరూ మాట వినరని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పేర్కొన్నారు. దంతో కాంగ్రెస్ నాయకులనే గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇప్పటికే ఆయా పంచాయతీల రిజర్వేషన్ల ప్రకారం ఎవరెవరిని అభ్యర్థులుగా నిలబెట్టాలనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. పార్టీ మండల నాయకులు, గ్రామాల నాయకులంతా కలిసి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపికచేసుకోవాలని ఎమ్మెల్యేలు సూచిస్తున్నారు. పోటీబలంగా ఉన్నచోట్ల జోక్యం చేసుకొని నాయకుల మధ్య వారు సర్దుబాటు చేస్తున్నారు. పదేళ్లగా ప్రతిపక్షంలో ఉండి కొట్లాడిన ద్వితీయ శ్రేణి నాయకులు పలువురికి, ఎమ్మెల్యేల గెలుపులో క్రియాశీలక పాత్ర వహించిన వారికి సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి ఎమ్మెల్యేలు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. దీంతో మిగతా 8వ పేజీలో...

ఏకగ్రీవాలు ఉండేనా?

» గత ప్రభుత్వ హయాంలో అందని నజరానా
» ఈ సారీ ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు
» కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేనా?



మోత్కూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించగా, ఈ నెల 27 నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. దీంతో పల్లెల్లో సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులను ఖరారు చేసేందుకు రాజకీయ పార్టీలు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకుంటాయనే చర్చ ప్రారంభమైంది.

ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు

సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామపంచాయతీలకు ప్రోత్సాహకంగా రూ.10లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి స్పందన ఏ మేరకు ఉంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎలాంటి ఘర్షణలు, వివాదాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పాలకవర్గాలను ఎన్నుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నజరానాను ప్రకటించింది. ఎన్నికల్లో పోటీపడి డబ్బు ఖర్చు పెట్టి గెలిచినా, ఓడినా ఆర్థికంగా నష్టపోవడం తప్ప సాధించేది ఏమీ ఉండదని, ఏకగ్రీవం చేసుకుంటే అభ్యర్థులకు ఖర్చు తప్పడంతోపాటు గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కొంత డబ్బు ఇస్తారని, దానికి తోడు ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షలతో అభివృద్ధి చేసుకోవచ్చని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఒక పార్టీ బలంగా ఉండి, మిగతా పార్టీలు బలహీనంగా ఉన్న చోట ఈ ప్రయత్నాలు అధికంగా జరుగుతున్నాయి. గతంలో కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు ఇస్తామని ప్రకటించింది. అందుకుతోడు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.10లక్షలు ఇస్తామని కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ప్రకటించారు. నాడు ఏకగ్రీవంగా ఎనుకున్న పంచాయతీలకు అటు ప్రభుత్వంగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ నిధులు ఇవ్వలేదు. దీంతో ఈ మిగతా 6వ పేజీలో...

● గత ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వలేదు



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.10లక్షలు ప్రోత్సాహక నిధులు ఇస్తామని చెప్పింది. ఆ నిధులతో గ్రామాన్ని కొంత అభివృద్ధి చేసుకోవచ్చని ప్రజలు ఐక్యంగా ఉండి సర్పంచ్‌గా నన్ను, ఇతర వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నా పదవీ కాలం ముగిసే వరకు ఎన్నిసార్లు అడిగినా గత ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఇస్తానన్న నిధులు ఇవ్వలేదు. దీంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేకపోయాం. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తుందని నమ్ముతున్న.

హైమావతి, మాజీ సర్పంచ్, కోట్యానాయక్ తండా, తిరుమలగిరి

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాణి కుముదిని, పాల్గొన్న కలెక్టర్

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత నామినేషన్లకు తీసుకున్న చర్యలు, బందోబస్తు, రిసెప్షన్ కేంద్రాల వివరాలను అప్‌లోడ్ చేయటం, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, వివిధ రకాల కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో గ్రామ పంచాయతీ ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు, పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఈ నెల 27 నుంచి స్వీకరించనున్న మొదటి విడత నామినేషన్ల సందర్భంగా ఆర్వోలతో తక్షణమే టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జీ అదనపు కలెక్టర్ నారాయణఅమిత్, అదనపు ఎస్పీ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. బుధవారం ఉదయాదిత్య భవన్‌లో ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి విడత 14 మండలాల్లోని 117 క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరిస్తామని, గ్రామపంచాయతీ ఎన్నికలను అధికారులందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమయపాలన పాటించాలని, నామినేషన్ల కేంద్రం వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని నామినేషన్ ఫాంలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో వెంకయ్య, నల్లగొండ, చండూరు ఆర్డీవోలు వై.అశోక్ రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే హక్కులకు రక్షణ

● ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంతోనే అందరి హక్కులకు రక్షణ ఉంటుందని ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని హక్కులు, బాధ్యతలు ప్రతీ పౌరుడు తెలుసుకొని ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్‌నాయక్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ.60వేలకోట్లతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 60వేల కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో పట్టణంలోని నాగార్జునసాగర్ ఎక్స్‌రోడ్ నుంచి దర్వేశిపురం ఎల్లమ్మ దేవాలయం వరకు మహబూబ్‌నగర్-నల్లగొండ రహదారికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. వారం రోజుల్లో సాగర్ ఎక్స్‌రోడ్ నుంచి దర్వేశిపురం వరకు నిర్మించే నాలుగు లేన్ల రహదారి పనులను ప్రారంభిస్తామన్నారు. దర్వేశిపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే రూ.12కోట్లతో సీసీ రోడ్డుతోపాటు, సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ మీడియన్ కట్టించామన్నారు. అలాగే కొత్తపల్లి-ముషంపల్లి రహదారులతోపాటు, జిల్లాలో అన్ని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లతోపాటు, మురుగు కాల్వలను నిర్మిస్తున్నామని, ఏఎంఆర్పీ కాల్వల లైనింగ్‌కు రూ.450 కోట్లు మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలే బస్సులను నిర్వహించుకునేలా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని, రైతు భరోసా, సన్న బియ్యం, సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఇల్లు లేని పేదవారు ఉండకుండా ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో రేషన్ షాపు ఉండేలా చూశామని, నియోజకవర్గంలో 18 కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే మూడేళ్లలో గ్రామాల స్వరూపాలను మారుస్తామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, నియోజకవర్గంలో కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాల్లో మహిళలతో రైస్ మిల్లుల నిర్వహణకు రైస్‌మిల్లు కట్టించి ఇస్తామన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను డిసెంబరులో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి

● మనోధైర్యం కల్పిస్తే సగం రోగం నయమైనట్లే ● డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



గుండ్రాంపల్లిలో మందుల నిల్వలను, రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రంలోని మందుల నిల్వలు, రికార్డులు, రోగులకు సంబంధించిన వివరాలను, పరీక్షల వివరాలను రికార్డులను పరిశీలించారు. రోగులకు అందించే మందులు సకాలంలో అందుతున్నాయా? అని, ప్రజలకు అందిస్తున్న సేవలను వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, సిబ్బందిని అడిగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ప్రజలు ఆసుపత్రులకు వస్తారని, వారికి ముందుగా సాంత్వన కలిగించే విధంగా వైద్యులు, వైద్యసిబ్బంది వ్యవహరిస్తే వారి అనారోగ్య సమస్యలను పూర్తిగా నివారించగలుగుతారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అనారోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ పరీక్షలు చేయాలన్నారు. వారివెంట ఏఎన్‌ఎంలు హేమలత, మల్లీశ్వరి, ఆశాలు శంకరమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

నల్లగొండ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్లు గురువారం నుంచి ప్రారంభమవుతున్న దృష్ట్యా సంబంధిత నోడల్ అధికారి అవసరమైన సామగ్రితో సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుంచి ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, నల్లగొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

● నామినేషన్ కిట్ అందజేత



పంచాయతీ ఎన్నికలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం నల్లగొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏఆర్వో, అసిస్టెంట్ ఏఆర్వోలకు నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన సామగ్రిని అందజేశారు.

పదవులు కాదు పార్టీయే ముఖ్యం

» దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి 7
» మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



భువనగిరిలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం ఆగదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించడాన్ని నిరసిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేయడం తగదన్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే బీసీలకు 17శాతం సీట్లు కూడా దక్కడం లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా బీసీ బిడ్డ ఎన్నిక కావడాన్ని రెడ్డీ సామాజిక వర్గం జీర్ణించుకోలేకపోతోందన్నారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జక్కా నాగేశ్వరరావు, కొరత సురేష్, రాము, గోపి, సైదయ్య, వెంకటేశ్వర్లు, జానకిరాములు, శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన పార్టీగా నిలిచిపోతుంది

మిర్యాలగూడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్, బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం సరికాదన్నారు. బీసీలను మభ్యపెట్టి, మోసగిస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు కవిత, రాజశేఖర్, వెంకటేష్, లక్ష్మణ్, ఫరూఖ్, నాగర్జున, వంశీ, భీమరాజు, శరత్, శ్రీను పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడలో ఆధ్యాత్మిక సందడి



అయ్యప్ప శోభాయాత్రలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ దంపతులు, భక్తులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో బుధవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన పడి పూజ శరణుఘోషతో . పూజ అనంతరం పురవీధుల్లో నిర్వహించిన స్వామి వారి శోభాయాత్రలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు. మాలధారణ గావించిన వందలాది మంది స్వాములు దేవదేవుల విగ్రహాలతో కాలినడక యాత్ర నిర్వహించగా, పట్టణ ప్రజలు పుష్పాలు చల్లుతూ స్వాగతం పలికారు. ఇక పట్టణంలోని పెద్దబజారులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణలతో జరిగిన కల్యాణోత్సవాని పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు పల్లకి సేవలో పాల్గొనేందుకు పోటీ పడ్డారు. హనుమాన్‌పేట సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవం కనుల పండువగా కొనసాగింది పూజల అనంతరం ఆయా ఆలయాల్లో కమిటీ సభ్యులు అన్నప్రసాద, భిక్ష నిర్వహించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

నేరేడుగొమ్ము,నవంబరు26(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని సీడీపీవో చంద్రకళ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ దత్తత, మా దక ద్రవ్యాల వినియోగం, బాలలపై లైంగిక వేధింపులు వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, ఎంపీవో, ఏపీఎం సూపర్‌వైజర్లు శోభారాణి, మేరీ, బాలల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూర : మండలంలోని పోతునూరు గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ సమక్షంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకొని సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మి, పోలీస్ సిబ్బంది కిషన్, అంగన్‌వాడి టీచర్లు, ఏఎన్ఎం లూసీ, మహిళా సంఘాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. దేవరకొండ డివిజన్‌లో డిసెంబరు 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని అన్నారు. అధికారులు ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలు అమలు చేయాలని కోరారు.

కేంద్రం కార్మిక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

దేవరకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే విధంగా 12 గంటల పనిదినాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, షైనొద్దిన్, మ ల్లయ్య పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎంవీఐ సతీష్

వేములపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మో టార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌లు అన్నారు. మండలంలోని నార్కట్‌పల్లి - అద్దంకి రహదారితోపాటు భీమారం- సూర్యాపేట రహదారిపై ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రదేశాలను వారు తహసీల్దార్ హేమలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

టీపీయూఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

గుర్రంపోడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లపు సైదయ్య, ప్రధాన కార్యదర్శిగా పొదిల యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పెండింగ్ డీఏలనువిడుదల చేయాలని డిమాండ్ చేశారు.

30న యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం

మిర్యాలగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండలకేంద్రంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి మోర్తాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కోడిరెక్క జయరాజు కోరారు. స్థానిక బకల్‌వాడీ పాఠశాలలో జిల్లా కమిటీ సమావేశం పోస్టర్‌ను బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. .కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సాజీద్ అలీ, బకల్‌వాడి పాఠశాల హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, కోశాధికారి లావుడి నెహ్రూ శివ, మక్లనాయక్, శ్రీనివాస్, జియావుద్దీన్, అజ్మత్‌ఖాన్, రహీంఖాన్, శ్రీదేవి, గిరిజ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బీసీలను మోసం చేసిం'

దేవరకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46 ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి మరోసారి బీసీలను మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం దేవరకొండలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్రత కల్పిస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, వెంకటేష్, చంద్రకళ, వీరయ్య, భిక్షమయ్య, శ్రీనివాసచారి, శంకర్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

పెద్దవూర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రులు, ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించి అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మంగ్తాభూక్యా, వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో పంచాయతీ సందడి షురూ

● రాజకీయ పార్టీల్లో మొదలైన అభ్యర్థుల వేట

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. మిర్యాలగూడ డివిజన్‌లో రెండో విడుత జరగనున్న ఎన్నికలకు స్థానిక నేతల హడావిడి ప్రారంభమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లతో ఎన్నికల జరగని పక్షంలో పాత రిజర్వేషన్ల పద్ధతి ప్రకారం రొటేషన్ పద్ధతిలో తమతమ గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని ముందుగానే ఊహించిన నేతలు గ్రామాల్లో కొంత గ్రౌండ్‌వర్క్ చేసి ఉన్నారు. నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం నుంచే తమ అనుచరులతో సమావేశాలు నిర్వహించడంలో తలమునకలయ్యారు. ఒకే పార్టీ నుంచి ఆశావాహులు ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో తమ మద్దతు దారులతో అధిష్టానం వద్ద బలప్రదర్శనతో అభ్యర్థిత్వం పొం దాలనే యోచన చేస్తున్నట్లు సమాచారం.

మిర్యాలగూడ మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ పోటీకీ ఇరువురు ఆశావాహులు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో పంచాయతీ అధికార పార్టీ అధిష్టానం వద్దకు చేరింది. స దరు నేత ఎవరిని అభ్యర్థిగా తేల్చలేక ఇరువర్గాల వారు గ్రా మ కార్యకర్తల మధ్య చర్చించుకుని సింగిల్ పేరు తీసుకరావాలని చెప్పి పంపడంతో కార్యకర్తలతో తమ పేరు చెప్పించుకునేందుకు సదరు నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

తమవారికే ఇవ్వాలని..

తమ వారికే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని మండల స్థాయి నేతలు నియోజకవర్గ నాయకత్వం వద్ద పైరవీలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా అధికార పార్టీలో ఈ తరహ పైరవీలతో నాయకత్వానికి తలనొప్పిగా మా రిందని అంటున్నారు. గ్రామపంచాయతీల్లో కొన్నింటినైనా తమ అనుచర వర్గానికి వచ్చేలా చూస్తే మండల స్థాయిలో తమ నాయకత్వం మరింత బలపడుతుందనే ఆలోచనలతో తమ అనునాయులకే అవకాశం దక్కేలా పావులు కదుపుతున్నారని అంటున్నారు.

రూ. 25 లక్షలు డిపాజిట్ పెడితేనే

మిర్యాలగూడ డివిజన్‌లో త్రిపురారం మండలంలో ఓ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిపై మోజు పెంచుకున్న ఓ ఉన్నత స్థానంలోని ఉద్యోగి నాలుగు నెలలుగా నిరుపేదలకు రూ.5వేలు పంచడంతో పాటు పేదలకు నెలనెల రూ. 1,000 పంపిణీ చేస్తూ వచ్చాడు. తీరా రిజర్వేషన్ తారుమారు కావడంతో తన అనుచరవర్గంలో ఒకరిని నిలబెట్టి గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉండగా అధికార పార్టీనుంచి ఆశావులు ఎ క్కువగా ఉండటంతో ఆ పార్టీ ద్వితీయశ్రేణి నేత రంగంలోకి దిగి తన వద్ద రూ.25 లక్షలు ముందు డిపాజిట్ చేసి పోటీ చేస్తామని ముందుకు రావాలని చెప్పడంతో ఆశావాహుల్లో తర్జభర్జనలు సాగుతున్నట్లు సమాచారం.

దేవరకొండ డివిజన్ పరిధిలో..

దేవరకొండ : దేవరకొండ డివిజన్‌లో మూడో విడుత డిసెంబరు 17న ఎన్నికలు ఎన్ని కలు జరుగనున్నాయి. డివిజన్‌లో 269 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్లను సైతం ప్రకటించి ఎన్నికల తేది ప్రకటించడంతో సర్పంచ్‌కి పోటీచేసే ఆశావాహులు హైదరాబాద్, వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు తరలివస్తున్నారు.

9 మండలాలు

దేవరకొండ డివిజన్‌లో దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, కొండమల్లేపల్లి, గుడిపల్లి, పీఏపల్లి, చింతపల్లి, గుర్రంపోడు 9 మండలాలు ఉన్నాయి. 2లక్షల 81వేల 329 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1 లక్ష 40వేల 912, స్త్రీలు 1లక్ష 40వేల 389 కాగా ఇతరులు 20 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. డివిజన్‌లో ఎస్టీ మహిళ రిజర్వేషన్లు 49, ఎస్టీ జనరల్ 56, బీసీ మహిళ రిజర్వేషన్లు 12, జనరల్ 16, ఎస్సీ మహిళ రిజర్వేషన్లు 18, జనరల్ 23, ఓపెన్ మహిళ 46, జనరల్ 49 మొత్తం 269 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.

గ్రామాలకు చేరుకుంటున్న ఆశావాహులు

గ్రామపంచాయతీల ఎన్నికల తేదీ ఖరారు కావడంతో సర్పంచ్‌కు పోటీచేసే ఆశావాహులు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి పోటీలో నిలిచే ఆశావాహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికార కాంగ్రెస్‌కు చెందిన నాయకులు రిజర్వేషన్ల ప్రకారం పోటీలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల తేది ప్రకటించడంతో గ్రామాల్లో రాజకీయ సందడి ఊపందుకుంది. ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

● శ్రీనివాసరావు, డీఎస్పీ, దేవరకొండ



స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు, అధికారులకు అందరూ సహకరించాలని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. దేవరకొండ సబ్‌డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నటు డీఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

డీఎస్పీ: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించాం. వాటిపై నిఘా పెట్టాం

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతారు?

డీఎస్పీ: జాతీయ రహదారి కోదాడ - జడ్చర్ల, సాగర్ -హైదరాబాద్ రోడ్డుపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

డీఎస్పీ:ప్రజలు పోలీస్‌శాఖ సూచించిన నిబంధనలు పాటించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి : సైబర్ నేరాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతారు?

డీఎస్పీ: ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దు. కొత్త వ్యక్తులు ఫోన్‌చేసి ఇబ్బందులుపెడితే వెంటనే డయల్ 100 సమాచారం ఇవ్వాలి.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి



తిరుమలగిరి(సాగర్) : రంగుండ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చింతపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవిన్యూ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, డిప్యూటి తహసీల్దార్ హర్షద్, ఆర్ఐ సునీత, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● గుర్రంపోడు : మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ గురుకుల కళాశాలలో బుధవారం వి ద్యార్థులకు. రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరిం చారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఫారూక్, అధ్యాపకులు వేణుగోపాల్, గోవర్ధన్, వెం కన్న, అతియా అంజు సుల్తానా పాల్గొన్నారు.

● దేవరకొండ : స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. భార త రాజ్యాంగం ద్వారా మహిళలకు హక్కులు, సేచ్ఛా, స్వాతంత్ర్యం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర అంజనేయులు ముత్తయ్య, ము త్యాలు, నాగరాజు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండలంలోని రంగుండ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ విలువలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు రాజ్యాంగ హక్కులు, విధులు, పౌరులకు కల్పించిన హ క్కుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, రాజేష్, విజిత, రజిత, వెంకటరమణ, చైతన్య పాల్గొన్నారు.

దేశ స్వావలంబనకు నెహ్రూ ఆలోచనలే పునాది

● జేవీవీ జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్పారామారావు



మాట్లాడుతున్న డాక్టర్ ముప్పారామారావు

మిర్యాలగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానంతరం భారత దేశ స్వావలంబనకు జవహర్‌లాల్ నెహ్రూ మహాత్మాగాంధీ, వల్లభాయ్ పటేల్ ఆలోచనలే పునాది అని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్పారామారావు అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ భవన్‌లో నెహ్రూ ఆలోచనా విధానం, శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తొలి ప్రధానిగా నెహ్రూ, పటేల్ ఆలోచనలకు అనుగుణంగా చేపట్టిన అనేక కార్యక్ర మాలు నేటికీ దేశ ప్రజలకు సత్ఫలితాలను అందిస్తున్నాయని అన్నారు. దేశ ఔనత్యాన్ని చాటేందుకు ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు గ్రంథాలయ ఉద్యమ నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. నవంబరు 14 బాలల దినోత్సవం, 26 నవంబరు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు రాజ్యాంగ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు ఉదయ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షుడు జె. కొండల్‌రెడ్డి, కిరణ్మయి, లైబ్రేరియన్ శ్యామ్‌సుందర్ ప్రసాద్, సుధాకర్, నాగరాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ పదవిపై మంత్రి వ్యతిరేకించడం సరికాదు

● బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి బీసీ నేతకు ఇస్తే మంత్రి వ్యతిరేకించడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన మా ట్లాడుతూ సామాజిక న్యాయం పాటించి కాంగ్రెస్ అధిష్టానం విద్యావంతుడు, యువకుడు బీసీ వర్గానికి చెందిన కైలాస్ నేతను జిల్లా అధ్యక్షుడిగా నియమించగా జిల్లా మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందించి పార్టీ అభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాల్సింది మరిచి అతడిని తొలగించాలని సీ ఎంకు లేఖ రాయడం సమంజసం కాదని అన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరన్న విషయం మంత్రికి తెలియంది కాదని అన్నారు. 5 సార్లు, ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా కోమటిరెడ్డి గెలిచింది బీసీల సహకారంతోనేన్నది మరువరాదని అన్నారు. పున్న కైలాష్‌కు బీసీ సమాజం అంతా అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు వేళాయె..

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

పోటీకి సై అంటున్న బీఆర్ఎస్

ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు సైతం గ్రామపంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. అన్ని పంచాయతీలు, వార్డుస్థానాల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకునేందుకు నేతలు సిద్ధమయ్యారు. మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమావేశాలు ఏర్పాటు చేశారు. బలమైన అభ్యర్థులను బరిలో నిలపాలని, కాంగ్రెస్‌పై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికార పార్టీ అమలుచేయకపోవడాన్ని పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో దీటైన నాయకత్వం ఉందని, బీఆర్ఎస్‌కు గ్రామాల్లో పట్టు నిలబెట్టేలా ఈ ఎన్నికల్లో బరిలో నిలవాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు మాజీ ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చాటి చెప్పాలని, ఈ రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని వైనాన్ని ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ముందుకు తెస్తోంది. మొత్తానికి అన్ని పంచాయతీల్లో బలమైన పోటీకి బీఆర్ఎస్ సిద్ధమైంది.

అన్ని సీట్లలో పోటీచేసేందుకు బీజేపీ సన్నాహాలు

జిల్లా రాజకీయాలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్న బీజేపీ ఈ ఎన్నికలను అందుకు వినియోగించుకోవాలని చూస్తోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉండడంతో, ఈ దఫా ఆసక్తి ఉన్న పార్టీ నాయకులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేయాలని నిర్ణయించారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వందశాతం కేంద్రం నిధులే వస్తున్నాయని, కేంద్ర ఆర్థిక సంఘం, మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న నిధులతోనే గత పదేళ్ల నుంచి పంచాయతీల్లో పరిపాలన కొనసాగిందని, అభివృద్ధి పనులు చేశారనే అంశాన్ని ఈ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే 20 నెలలుగా నిధులు నిలిచి గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందనే వాదన బీజేపీ నుంచి వినిపిస్తోంది. తాజాగా ఈ ఎన్నికల్లో ఇవే అంశాలు ఏజెండాగా బీజేపీ ప్రచారం చేయనుండడంతో పంచాయతీ పోరు రక్తికట్టనుంది.

సత్తాచాటాలని నిర్ణయించిన సీపీఎం, సీపీఐ

అధికార కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్న సీపీఐ ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో పాటు, సీపీఎంతోనూ కలిసి పోటీకి సిద్ధమైంది. పార్టీకి మొదటి నుంచి పట్టున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో ఎక్కువస్థానాల్లో, మిగిలినచోట్ల బలం కలిగిన గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాల్లో పోటీచేయాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. అదేవిధంగా సీపీఎం సైతం ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతోంది. పార్టీ రహితంగా జరిగే ఎన్నికలు అయినప్పటికీ పోటీకి నాయకులు సిద్ధమయ్యారు. పార్టీ శాఖలు బలంగా ఉన్న గ్రామాల్లో పోటీచేయాలని నిర్ణయించారు. సీపీఐతో పొత్తును కొనసాగిస్తూ అన్ని నియోజకవర్గాల్లో పోటీచేయాలని సంకల్పించింది. నామినేషన్ల పర్వం మొదలైతేగానీ అభ్యర్థిత్వాలపై స్పష్టతరానుంది.

బీఆర్ఎస్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాల మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియాలోని తన నివాసంలో బుధవారం బీఆర్ఎస్ పెద్దవూర మం డల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా చలకుర్తి గ్రామం నుంచి చల్లా అంజిరెడ్డితో పాటు 30 కుటుంబాలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, మాజీ ఎంపీపీ చెన్ను సుందర్‌రెడ్డి, అబ్బాస్, పొదిల శ్రీను, కోట్ల బాలయ్య, మెండే సైదులు, శ్రీకర్‌నాయక్, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ



ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ లో పాల్గొన్న అయ్యప్ప మాల ధారులు

కొండమల్లేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని సీతారామచంద్ర మౌళీశ్వర అయ్యప్పఆలయం లో బుధవారం వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠించా రు. ఈ సందర్భంగా వేద పండితులు పాలకుర్తి దేవి ప్రసాద్ శర్మ, కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ాలయ అధ్యక్షుడు నాయిని మాధవరెడ్డి, నీల లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి, చందా ధనుంజయ, నీల విజయ్, అయ్యప్ప గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, పూజారులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయాన్ని వెంటనే నిర్మించాలి

పెద్దవూర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167)పై ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన కూలిపోయిన పోచమ్మ ఆలయాన్ని వెంటనే నిర్మించాలని పెద్దవూర గ్రామస్థులు బు ధవారం మండల కేంద్రంలో ధర్నాకు దిగారు. ఫ్లై ఓవర్ పనులు కారణంగా రోడ్డు పక్కన ఉన్న పోచమ్మ ఆలయా న్ని తొలగించారని, కాంట్రాక్టర్ దాన్ని పునర్‌నిర్మించాలని డిమాండ్ చేశారు. పోచమ్మ గుడిని వేరే ప్రాంతం లో నిర్మిస్తామని హామీ ఇస్తే తప్పా నిరసన ఆపేది లేదన్నారు. ధర్నాతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకోని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఏఎస్పీ మౌనికను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కొండమల్లేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో పని చేసినప్పుడు ప్ర జల్లో గుర్తింపు లభిస్తుందని పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ మౌనిక అన్నారు. కొండమల్లేపల్లిలోని విష్ణు కాంప్లెక్స్‌లో బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ మౌనికను దేవరకొండ సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ 11 నెలల పాటు దేవరకొండ ఏఎస్పీగా విధులు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని అన్నారు. అనంతరం ఏఎస్పీని సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు బీసన్న, వెంకట్‌రెడ్డి, రా జు, ఎస్ఐలు అజ్మీర రమేష్, రాంమ్మూర్తి, పసుపులేటి మధు, బాలకృష్ణ, నర్సింహగౌడ్, సాలకమ్మ పాల్గొన్నారు.